తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
10-10-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 242
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## 12న మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం

- ఎల్‌నినో ప్రభావం, వర్షాభావంపై చర్చ
- సీఎం రేవంత్ రెడ్డి

3



## ఢిల్లీని చుట్టుముట్టిన భద్రతా వలయం

- సీజేపీ నిరసన నేపథ్యంలో 40 వేల మంది పోలీసులతో భద్రత
- 57 మెట్రో స్టేషన్ల మూసివేతకు పోలీసుల ప్రతిపాదన
- పలు కీలక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు
- భద్రతపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్షలు

4





## 45 ఎకరాల అసైన్డ్ భూమి

# లెక్కల్లో తేడా

- ఎర్రవల్లి భూములపై మళ్లీ రాజకీయ రగడ
- సర్వే నంబర్ 325లో 388 ఎకరాలకు బదులు 343 ఎకరాలే గుర్తింపు
- పూర్తిస్థాయి రీ–సర్వేకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- భూ రికార్డులతో విచారణకు కేసీఆర్ కుటుంబానికి నోటీసుల యోచన
- భూమి ప్రభుత్వానిదని తేలితే స్వాధీనం చేసుకుంటామంటున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 9:**
సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఫామ్‌హౌస్ పరిసరాల్లో భూముల లెక్కలపై వివాదం తెరపైకి వచ్చింది. సర్వే నంబర్ 325 పరిధిలో రికార్డుల ప్రకారం ఉండాల్సిన భూమికి, క్షేత్రస్థాయి సర్వేలో గుర్తించిన విస్తీర్ణానికి మధ్య సుమారు 45 ఎకరాల వ్యత్యాసం ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

**రికార్డులు, భూములపై పరిశీలన**
ప్రభుత్వ రికార్డుల్లో సర్వే నంబర్ 325 పరిధిలో 388 ఎకరాలు ఉండాల్సి ఉండగా, ప్రాథమిక సర్వేలో 343 ఎకరాలే గుర్తించినట్లు తెలుస్తోంది. మిగిలిన భూమి ఎక్కడుందనే అంశంపై రెవెన్యూ అధికారులు

మిగతా 3వ పేజీలో..

## భూ వివాద రహిత

# తెలంగాణే లక్ష్యం

- ఏడాదిన్నరలో సమగ్ర భూసర్వే పూర్తి చేస్తాం
- సర్వే పర్యవేక్షణకు 7 జోన్లకు 14 మంది అధికారుల నియామకం
- రీ-సర్వేలో నాణ్యత, పారదర్శకత, వేగం అత్యంత కీలకం
- ఉన్నతస్థాయి సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సిరి న్యూస్ ,అక్టోబర్ 9 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర రీసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సచివాలయంలో శుక్రవారం

మిగతా 2వ పేజీలో..



## ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా 'గ్లోబల్ సమ్మిట్'

- తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచస్థాయికి తీసుకెళ్లాలి
- అధికారులకు భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు

2



## నేటి నుంచి బతుకమ్మ సంబరాలు

- తొమ్మిది రోజుల పాటు ప్రకృతి ఆరాధనగా పూల పండుగ
- రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభ
- ఉత్సవాల నిర్వహణకు రూ.10 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**
బతుకమ్మ సంబరాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. మహాలయ అమావాస్య మొదలు తొమ్మిది రోజులపాటు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించే సంప్రదాయానికి యావత్ తెలంగాణ సిద్ధమైంది. సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే ఈ వేడుకలతో పాటు దేవీ నవరాత్రి ఉత్సవాలనుకూడా అత్యంత వైభవోపేతంగా జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తున్నది. ఈ వేడుకలకుగాను రాష్ట్రవ్యాప్తంగా పలు దేవాలయాలను

మిగతా 3వ పేజీలో..





## సింథటిక్ మాంజా విక్రయిస్తే లైసెన్సు రద్దు

- పాల పిట్టల రక్షణకు పటిష్ట చర్యలు
- అటవీ దళాల అధిపతి వినయ్‌కుమార్

2

## భారత మూలాలున్న మహిళకు నోబెల్ శాంతి పురస్కారం

- దక్షిణాఫ్రికాకు చెందిన నవీ పిళ్లై ఎంపిక



4



## మెడికల్ టూరిజం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

- 'గ్లోబల్ సమ్మిట్'కు ముందే డీపీఆర్‌లు సిద్ధం చేయాలి
- సింగిల్ విండో పోర్టల్ ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, సిరి న్యూస్, అక్టోబర్ 9 :**
లంగాణ టూరిజం పాలసీ 202530లో భాగంగా మెడికల్ వెల్‌నెస్ టూరిజం అభివృద్ధికి సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సీనియర్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మెడికల్

మిగతా 2వ పేజీలో..

## 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా

# హైదరాబాద్

- ప్రపంచస్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'ఎకో సిస్టమ్'
- గ్లోబల్ కంపెనీల అవసరాల కనుగుణంగా అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 9 :**
గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాక హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా తీర్చిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ,

మిగతా 2వ పేజీలో..





## కల నెరవేరి పదేళ్లు పూర్తి

- నాటి గోడ మీద రాతలే నేడు నిజయమ్యాయి
- జిల్లా కోసం ఎన్టీఆర్ కు వినతిపత్రం ఇచ్చిన కేసీఆర్
- అదే కేసీఆర్ సీఎంగా సిద్దిపేట జిల్లా ఏర్పాటు
- రైలు, గోదావరి జలాలు సిద్దిపేటకు వచ్చాయి
- సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

2




## ఢిల్లీలో 24 గంటల పాటు మొబైల్ ఇంటర్నెట్ నిలిపివేత

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్
- అక్టోబర్ 10న నిరసనకు పిలుపు

4

## మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు అభ్యంతరం

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ నిరసన పిలుపు
- 57 మెట్రో స్టేషన్ల మూసివేత నిర్ణయంపై కోర్టు అసంతృప్తి

4



# మెడికల్ టూరిజం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

**మొదటిపేజీ తరువాయి**

వెల్‌నెస్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. రాష్ట్రంలో మెడికల్ టూరిజం అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండటం రాష్ట్రానికి అనుకూలమైన అంశాలని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మెడికల్ టూరిజం గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో 89 ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందిన హాస్పిటల్స్, 8 జేసీఐ గుర్తింపు పొందిన హాస్పిటల్స్ ఉన్నాయని అధికారులు తెలిపారు. మధ్య ప్రాచ్య దేశాలు, ఆఫ్రికా దేశాలు సహా వివిధ దేశాల నుంచి వైద్య చికిత్సల కోసం రోగులు హైదరాబాద్‌కు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సాంకేతికత, ఆధునిక పరికరాలు, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం వల్ల అంతర్జాతీయ టూరిస్టులను మరింతగా ఆకర్షించే అవకాశం ఉందని వివరించారు. మెడికల్ టూరిజం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల అవకాశాలు, అంతర్జాతీయ ప్రచారం, సేవల సమన్వయం వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. ఈ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులను ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ప్రోత్సహించాలని, అవసరమైన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు. వైద్య సేవలను సులభతరం చేసేందుకు వివిధ శాఖలు, హాస్పిటల్స్, సంబంధిత సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించాలని, మెడికల్ టూరిజం సేవల కోసం సింగిల్ విండో పోర్టల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వైద్య సంప్రదింపులు, చికిత్స, హాస్పిటల్ సేవలు, అవసరమైన ఇతర సదుపాయాలు సులభంగా అందేలా వ్యవస్థలను రూపొందించాలని సూచించారు. అలాగే అవయవ మార్పిడి చికిత్సలకు సంబంధించిన ప్రక్రియలను నిబంధనలకు అనుగుణంగా మరింత క్రమబద్ధీకరించేందుకు, సంబంధిత అనుమతులు, సమన్వయం, సేవల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయి మెడికల్ వెల్‌నెస్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ముందే ప్రాధాన్యతా ప్రాజెక్టులు, పెట్టుబడుల ప్రతిపాదనలు, అమలు ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సమావేశంలో వైఏటీ అండ్ సీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కల నెరవేరి పదేళ్లు పూర్తి

**సిద్దిపేట, సిరి న్యూస్ , అక్టోబర్ 9:**

సిద్దిపేట జిల్లాగా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 10కె రన్ ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఉదయాన్నే ఆహ్లాదకరమైన వాతావరణంలో వేలాదిమంది యువతీయువకులు, క్రీడాకారులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు ఈ పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు. హరీశ్ రావు కూడా 10కె రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అనేది ఒక దశాబ్దాల కల. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్దిపేట జిల్లా చేస్తామని 30 ఏళ్లు, 40 ఏళ్లు గోడల మీద రాతలు, ఎన్నికల నినాదాలు, కరపత్రాలు చూశాం. కానీ ఆ కలను నిజం చేసుకున్న రోజు 2016 అక్టోబర్ 11 అని గుర్తు చేశారు. 2026 అక్టోబర్ 11నాటికి మన సిద్దిపేట జిల్లాకు 10 ఏళ్లు నిండుతున్నాయి. పదేళ్లు నిండుతున్న పండుగలో మీరందరూ ఈ 10కె రన్‌లో పాల్గొనడానికి రావడం చాలా సంతోషమన్నారు. ఈ రన్ ఎంత వేగంగా జరుగుతుందో మన సిద్దిపేట జిల్లా కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఇన్ని స్పోర్ట్స్ క్లబ్స్ వచ్చాయంటే, ఇంత గొప్ప క్రీడా మైదానాలు ఇక్కడ ఏర్పడ్డాయంటే, ఇన్ని జిల్లా కార్యాలయాలు ఇక్కడ వచ్చాయంటే, సిద్దిపేట ఇంత వేగంగా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం జిల్లా ఏర్పడడం వల్లే సాధ్యమైందన్నారు. ఇక్కడ తమ పీఈటీ టీచర్లు కనబడుతున్నారు, స్పోర్ట్స్ క్లబ్స్ వాళ్లు కనబడుతున్నారు.. ఆ రోజుల్లో ఉపాధ్యాయుల బదిలీలు ఉంటే పొద్దున్నే 5 గంటలకు బస్సెక్కి సంగారెడ్డి పోయి ఎన్ని రకాల బాధలు పడ్డారో నాకంటే ఎక్కువ అనుభవించిన వాళ్లకే బాగా తెలుసన్నారు. నాడు కానిస్టేబుల్ పరీక్ష రాయడానికి సంగారెడ్డిలో పొద్దున్నే 8 గంటలకు రన్నింగ్ టెస్ట్, హై జంప్, లాంగ్ జంప్ టెస్ట్ ఉంటే రాత్రి పోయి బస్టాండ్‌లో పడుకుని, దోమలు కుడుతుంటే ఎంతో ఇబ్బంది పడి ఉదయం రన్నింగ్‌లో పాల్గొన్నామని మొన్న ఒక కానిస్టేబుల్ తనతో చెప్పారన్నారు. ఇవాళ జిల్లా ఏర్పడ్డ తర్వాత అది ఎంసెట్ పరీక్ష అయినా, ఇంకే పరీక్షలైనా సిద్దిపేటలోనే మనం చేసుకోగలుగుతున్నామన్నారు. ముఖ్యంగా మంచిర్యాల జిల్లా, సిద్దిపేట జిల్లా, మెదక్ జిల్లా ఇలా ప్రజలకు ఎన్నో కోరికలు ఉండేవి. ఆ 33 జిల్లాల కలను నిజం చేసి 33 అభివృద్ధి కేంద్రాలను తీర్చిదిద్దిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుంది. జిల్లా ఏర్పడకముందు సిద్దిపేట ఎట్లా ఉండేది? జిల్లా ఏర్పడ్డ తర్వాత ఎట్లా మారింది? రేపటి సిద్దిపేట ఎలా ఉండాలో కల కనాలి.. ఆ కలను నిజం చేసుకోవడం కోసం మనమందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా ఆకాంక్ష లేకపోతే దానికి ఒక రూపం ఉండదు. జిల్లా కావాలనే ఆకాంక్ష 1983లోనే మొదలైంది. 1983లో అప్పట్లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సిద్దిపేటకు వచ్చారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా సిద్దిపేటకు వస్తే అంబేద్కర్ స్టాచ్యూ దగ్గర కేసీఆర్ సిద్దిపేట జిల్లా ఏర్పాటు చేయాలని చెప్పి దరఖాస్తును ఎన్టీఆర్ కు ఇచ్చారు. ఏ చేత్తోనైతే ఎన్టీఆర్ కు దరఖాస్తు ఇచ్చారో తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అదే చేత్తో సంతకం పెట్టి కేసీఆర్ సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. 1983 నుంచి 2016 అంటే 30 ఏళ్ల తర్వాత తానే ముఖ్యమంత్రిగా ఈ జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. ఒకప్పుడు మనకు మూడు నినాదాలు ఉండేవి.. సిద్దిపేట జిల్లా కావాలి, సిద్దిపేటకు రైలు రావాలి, సిద్దిపేటకు గోదావరి జలాలు రావాలి. ఈ మూడు కూడా ఇవాళ కళ్ల ముందు నిజమైనాయి కదా. కళ్లముందు రంగనాయక సాగర్‌లో గోదావరి జలాలు కనబడుతున్నాయి. ఇటు నర్సాపూర్ వైపు చూస్తే పొద్దున్నే చుక్ చుక్ రైలు కనబడుతుంది. ఇటు సిద్దిపేట జిల్లా ఏర్పడి కలెక్టర్, సీపీ, జిల్లా కార్యాలయాలతో అద్భుతమైన సిద్దిపేటను మనం ఆవిష్కరించుకోగలిగాం అని చెప్పారు. మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ఫార్మసీ కాలేజ్, పారామెడికల్ కాలేజ్, పాలిటెక్నిక్ కాలేజ్, బీఫార్మసీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, పీజీ కాలేజ్, మేనేజ్‌మెంట్ కాలేజ్.. ఇట్లా ఎన్నెన్నో కాలేజీలు తెచ్చుకున్నాం. రేపటి సిద్దిపేటలో ఒక యూనివర్సిటీ రావాలి.. ఇదొక్కటే ఇక మనకు తక్కువ ఉన్నది. ఆ యూనివర్సిటీని కూడా తప్పకుండా సాధించుకుందాం.. ఆ దిశగా మనం అడుగులు వేద్దాం, ఆ దిశగా ప్రయాణిద్దాం, ఆ దిశగా మన పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తును ఆవిష్కరించుకుందాం అని హరీశ్‌రావు అన్నారు.న్నారు.




# భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో వేగం, నాణ్యతతోపాటు ప్రతి దశలో నిరంతర పర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సుమారు 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు లభించిన ఈ అవకాశాన్ని అధికారులు అత్యంత బాధ్యతతో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. రీసర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు ఏడు జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. సర్వే తీరును, నాణ్యతను, ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు పరిశీలించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షా లేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే ముమ్మరంగా సాగుతుందని, ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. మొదటి దశ సర్వేను నవంబర్ ఆఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు రెవెన్యూ గ్రామాల్లో సర్వే తప్పనిసరిగా చేపట్టేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కో బృందంలో లైసెన్స్‌డ్ సర్వేయర్, జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆరఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది ఉంటారని వివరించారు. సర్వే జరుగుతున్న ప్రాంతాల్లో ప్రతి రోజూ తహసీల్దార్ పర్యటించి పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ రోజు ఎక్కడ సర్వే జరిగింది.. ఎన్ని ఎకరాలు/సర్వే నంబర్లు పూర్తయ్యాయి.. ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది.. ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే అంశాలపై అధికారులు స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీసర్వే జరగాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



**హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డు**

రీసర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ అందులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. సర్వేకు అవసరమైన సర్వేయర్లు, రోవర్లు, సర్వర్లు, ఇతర సాంకేతిక పరికరాలు, సామగ్రి కొనుగోలుకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. అదనపు రోవర్లను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని, ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దులను గుర్తించే ప్రక్రియలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రీసర్వే పేరుతో ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

**మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి**

సచివాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉందని, సర్వే కోసం మరోసారి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయని, వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు అమరవీరులను గుర్తించి న్యాయం చేస్తామన్నారు. ఎర్రవల్లిలో కూడా నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతామని స్పష్టం చేశారు.

**జీవో 59 దరఖాస్తుదారులకు శుభవార్త**

**– 500 చ.గ లోపు పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం**

22ఎ సమస్యలను పరిష్కరిస్తామని గత నెల 16న శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ఈరోజు మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుతో కలుపుకుంటే ఆరు ఉత్తర్వులు ఇచ్చామని, తాజాగా జీవో ఎంఎస్ నెం.59 కింద 500 చదరపు గజాలు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో నెంబర్లు 14, 22, 29, 41 అనుగుణంగా మెమో నెంబర్ 48030ను జారీ చేశామని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఏమైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జీవో 59 పరిధిలోని ఆస్తుల విషయంలో అసలు భూమి రికార్డులు, లబ్ధిదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన విస్తీర్ణం తదితర అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా నిర్ణయం తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత ప్రభుత్వంలో 59 జీవోను అనుసరించి కొన్ని అక్రమాలు జరిగాయని తమ దృష్టికి రావడంతో జీవో అమలును నిలిపివేశామని, అలాంటి తప్పులు పునరావృతం కాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించిన కన్వేయన్స్ డీడ్స్ జారీ అయిన కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకొస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గతంలో జీవో 59 కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనేక కారణాలతో వాటిని పెండింగ్‌లో ఉంచారని, దీంతో చిన్నచిన్న ఇళ్ల స్థలాలు, ఆస్తులకు సంబంధించిన సమస్యలతో సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న దరఖాస్తులు, వివాదాస్పద అంశాల విషయంలో సంబంధిత కోర్టులు ఇచ్చే ఆదేశాలకు లోబడి మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు.

**22-ఎ సమస్యలకు వరుస పరిష్కారాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 22ఎ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సహచర మంత్రులతో చర్చించి 22ఎతో ముడిపడి ఉన్న 10 నుంచి 12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జీవో 118, జీవో 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలను జారీ చేశామన్నారు. 22ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచఎంసీ, హెచఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇవ్వడం, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టాభూముల సమస్యకు పరిష్కారం, తాజాగా 59జీవో అమలు దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ‘గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్’గా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రహెన్సివ్ ఎకోసిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం ‘బ్యాక్‌బేస్’ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆనతి కాలంలోనే టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్‌ను గ్లోబల్ కంపెనీలకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దామన్నారు. బ్యాక్‌బేస్ లాంటి దిగ్గజ కంపెనీల విస్తరణే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం, పెద్ద కంపెనీలను రప్పించడమే కాకుండా డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి రంగాల్లో ఉపాధి అవకాశాలను దక్కించుకునేలా తెలంగాణ యువతను సంసిద్ధం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు చూపే సత్తా టెక్నాలజీకి ఉందని, ఆ దిశగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఉత్పత్తులను అందించడంలో ఈ బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ కొత్తగా 300మంది హైస్కిల్డ్ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ సీటీఓ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా ‘గ్లోబల్ సమ్మిట్’

**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 9 :**

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీలలో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0కు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కోసం ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను శుక్రవారం ఆయన సందర్శించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి, సమన్వయం ఉండేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమ్మిట్ విజయవంతానికి ప్రతి శాఖ కృషి చేయాలన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి ప్రతి అధికారి సమష్టి బాధ్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. భట్టి విక్రమార్క వెంట ఆర్థిక, ప్లానింగ్ ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తో పాటు ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

# సింథటిక్ మాంజా విక్రయిస్తే లైసెన్సు రద్దు

**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 9 :**

సింథటిక్ మాంజా విక్రయాలు, వినియోగాన్ని అరికట్టడంతో పాటు పాలపిట్టలు, ఇతర వన్యప్రాణుల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని అటవీ దళాల అధిపతి వినయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నిషేధిత మాంజా విక్రయించే దుకాణాల లైసెన్సుల రద్దుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశాలపై అరణ్య భవన్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింథటిక్ మాంజా ఇతర రాష్ట్రాల నుంచి ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చే సరఫరాలపై నిఘా పెంచాలని సూచించారు. ఈ మాంజా విక్రయించరాదని దుకాణాల యజమానులకు జీహెచఎంసీ అధికారులు ఆదేశాలు జారీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ వేదికల ద్వారా చైనా మాంజా విక్రయాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకామర్స్ వెబ్‌సైట్లలో సింథటిక్ మాంజా విక్రయాలను గుర్తించి వాటిని అరికట్టేందుకు సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ మాంజా నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాలు సహా అన్ని బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చైనా మాంజా వినియోగం వల్ల మనుషులు, పక్షులకు కలిగే ప్రమాదాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల విద్యాశాఖ అవగాహన కల్పించాలని తెలిపారు. బస్సుల్లో సింథటిక్ మాంజా అక్రమ రవాణా లేదా పాలపిట్టలు, ఇతర వన్యప్రాణుల తరలింపును గుర్తిస్తే అటవీ శాఖ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించేలా బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలు ఇవ్వాలన్నారు.



**కైట్ ఫెస్టివల్‌లో అనుమతించొద్దు**

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కైట్ ఫెస్టివల్‌లో చైనా మాంజా వినియోగంపై స్వచ్ఛంద సంస్థల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సమావేశంలో ప్రస్తావించారు. ఈసారి ఉత్సవాల్లో సింథటిక్ మాంజాను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని, గుర్తించిన వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**పాలపిట్టలను పంజరాల్లో ఉంచొద్దు**

దుర్గా మండపాల వద్ద పాలపిట్టలను పంజరాల్లో ఉంచి ప్రదర్శించకుండా చర్యలు తీసుకోవాలని వినయ్‌కుమార్ ఆదేశించారు. దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఆలయాల వద్ద ఈ ఆదేశాలు అమలయ్యేలా చూడాలన్నారు. వన్యప్రాణుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీసీఎఫ్‌లు ప్రియాంక వర్గీస్, క్షితిజ, సీఎఫ్ ప్రసాద్ పోలీసు, జీహెచఎంసీ, హెచఎండీఏ, పాఠశాల విద్య, సినిమాటోగ్రఫీ, సమాచార ప్రసార, విద్యుత్తు, కాలుష్య నియంత్రణ మండలి, పర్యాటక శాఖలతోపాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేటి నుంచి బతుకమ్మ సంబరాలు

**మొదటిపేజీ తరువాయి**

సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆద్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉంటే ఆబాలగోపాలం ఎంతో శ్రద్ధతో జరుపుకునే బతుకమ్మ పండుగ ఏర్పాట్లకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులను కేటాయించింది. గ్రామీణ ప్రాంతాలు మొదలు పట్టణాలు, నగరాల్లో బతుకమ్మను ఆడుకునే స్థలాలను తీర్చిదిద్దటం, తొమ్మిదవ రోజు నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లకు ఈ నిధులను వెచ్చిస్తున్నారు. సుమారు వెయ్యి సంవత్సరాలుగా తెలంగాణ ప్రాంత ప్రజలు బతుకమ్మ ఉత్సవాలను జరుపుకుంటున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. సీమాంధ్ర పాలకుల ఏలుబడిలో ఈ ఉత్సవాలకు అధికారికంగా పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వకపోయినా ప్రజలు తమ సంప్రదాయం ప్రకారం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగిస్తూనేఉన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత దీన్ని రాష్ట్ర పండుగగా గుర్తించి ఏటా దీని కోసం ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్నది. చల్లని బతుకునిచ్చే తల్లిగా కొలువబడుతున్న బతుకమ్మను గౌరీదేవిగా ఆరాదిస్తారు. ఇది ప్రకృతిని ఆరాదించే వేడుకగా ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. ప్రకృతిసిద్ధంగా లభించే పూలను ఆరాదించడమన్నది తెలంగాణ ప్రాంతంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా కనిపంచదు. అదికూడా అడవిలో పూచే పూలతో కొలవడమన్నది ఇక్కడ ప్రత్యేకత. తంగేడు, గునుగు పూలు లేకుండా బతుకమ్మను పేర్వరు. వాస్తవానికి ఈ పండుగకూడా పూలు వికసించే కాలంలోనే వస్తుండడంతో సహజసిద్ధమైన పూలకు కొదువ వుండదు. అయితే పూర్వం విస్తారంగాఉన్న అడవులు తగ్గి కాంక్రీట్ జంగల్లుగా మారటంతో తంగేడు, గునుగు పూల లభ్యత తగ్గింది. దీంతో మార్కెట్‌లో లభించే పూలతోనే సంతృప్తి చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ ప్రాశస్తం గురించి అనేక కథలు వెలుగులో ఉన్నప్పటికీ, మన సంప్రదాయాలు, కట్టుబాట్లు, భక్తి శ్రద్ధలు, ఆద్యాత్మికత తదితర అంశాలు కథాంశంగా ఎంతో లయబద్ధంగా పాటల రూపంలో రానున్న తరాలకు తెలియచెప్పటం ఇందులోని ప్రధానాంశం. ముఖ్యంగా సామూహికంగా జరుపుకునే ఉత్సవం కావటంవల్ల ఇక్కడ చిన్న పెద్ద, పేద ధనిక అన్న బేదాలే కనిపించవు. శంఖు ఆకారంలో ఎంత వీలైతే అంత ఎత్తున రంగురంగుల పూలతో ఎంతో అందంగా అలంకరించి, చివరన మధ్యలో పసుపుతోచేసిన గౌరమ్మను పెట్టి పూజించడం, దాన్ని విశాల ప్రదేశంలోపెట్టి చుట్టూ చిన్నారులతోపాటు వృద్ధులైన మహిళలు చప్పట్లతో పాటలుపాడుతూ తిరగడమన్నది ఒక అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగించే అంశం. తెలంగాణ ఉద్యమకాలంలో ఈ వేడుక ఈ ప్రాంతాన్ని దాటి అనేక దేశాలకు విస్తరించింది. తెలంగాణేతరులు కూడా ఈ వేడుకల్లో ఇప్పుడు బాగస్వాములవుతున్నారు. ఇంతగొప్ప వేడుకకు 2018లో గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించింది. ఆ సంవత్సరం సెప్టెంబర్ 19న సుమారు పదివేలమంది మహిళలు బతుకమ్మ కార్నివాల్ నిర్వహించారు. ఇందుకుగాను హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో 63 అడుగుల ఎత్తు, 11 అడుగుల వెడల్పు, ఏడుటన్నుల పూలతో ఇక్కడ బతుకమ్మను ఏర్పాటు చేయడం విశేషం. అంతకు ముందు 2018లో తెలంగాణ పర్యాటక శాఖ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ అద్వర్యంలో అక్టోబర్ 19న ఆకాశంలో బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించడంద్వారా ఆ వేడుకలకు ఆకాశానికి ఎత్తినట్లైంది. హైదారాబాద్ బైసన్‌పోలోగ్రౌండ్‌లో పలువురు మహిళలు బతుకమ్మను చేతపట్టుకుని పారామోటర్‌లో అయిదు నిమిషాలపాటు గగన విహారం చేశారు. ఈసారికూడా ఈనెల 18న చివరి రోజున రాష్ట్ర రాజధానిలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నది.



# 12న మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం

- **ఎల్‌నినో ప్రభావం, వర్షాభావంపై చర్చ**

**హైదరాబాద్, సిరి న్యూస్ , అక్టోబర్ 9 :**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతోపాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.

# నవంబర్ 19 నుంచి 85వ ఐఆర్‌సీ

- **ఏర్పాట్లపై ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి సమీక్ష**
- **3,000 మంది ఆహ్వానితులు, జాతీయ స్థాయి సదస్సు**
- **ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్, కేంద్ర మంత్రి గడ్కరీ**



**హైదరాబాద్,సిరి న్యూస్ అక్టోబర్ 9 :**

ఇండియన్ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ)ను హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్లోబల్ సమ్మిట్ తరహాలో సదస్సు ఏర్పాట్లు ఉండాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంటరెడ్డి అధికారులను ఆదేశించారు. నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఐఆర్‌సీ జాతీయ సదస్సు ఏర్పాట్లపై సెక్రటేరియట్‌లో మంత్రి కోమటిరెడ్డి శుక్రవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఐఆర్‌సీ విజయవంతం కోసం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌లో పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి మంత్రులు, కార్యదర్శులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇంజనీర్లు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి రహదారుల నిపుణులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు కలిపి సుమారు 3,000 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని మంత్రి తెలిపారు. హైటెక్స్‌లో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు జరగనున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, నిపుణులు ఒకే వేదికపై సమావేశం కావడం వల్ల తెలంగాణకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతోపాటు పెట్టుబడులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**నాలుగు రోజుల షెడ్యూల్**

19న ఉదయం 11 గంటలకు ఐఆర్‌సీ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రహదారుల నిర్మాణం, భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై అంతర్గత చర్చలు, నిపుణులతో గ్రూప్ డిస్కషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఆ రాత్రి హైటెక్స్‌లో వివిధ రాష్ట్రాల అతిథులు, నిపుణులకు ముఖ్యమంత్రి ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారని తెలిపారు. 20న కేంద్ర మంత్రి గడ్కరీ సమక్షంలో చర్చలు కొనసాగుతాయని, 21న ముగింపు కార్యక్రమం నిర్వహించి గవర్నర్‌ను ఆహ్వానిస్తామని తెలిపారు. 22న మధ్యాహ్నం ప్రతినిధుల తిరుగు ప్రయాణాలు ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇది నిర్వహించడం రెండోసారి అని చెప్పారు.

**త్వరలో హైదరాబాద్-విజయవాడ 6+2 లేన్ల రహదారి పనులు**

హైదరాబాద్‌విజయవాడమచిలీపట్నం ఎన్‌హెచ్ 65ను ఆరు ప్రధాన లేన్లు, రెండు సర్వీస్ లేన్లతో విస్తరించేందుకు రూ.12,073 కోట్లతో ఇప్పటికే ఆమోదం లభించిందని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. సాంకేతిక కమిటీల ప్రక్రియ పూర్తయిందని, కేంద్ర మంత్రివర్గ కమిటీ ఆమోదం పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఇటీవలి ఐఆర్‌సీలో, గుజరాత్ చింతన్ శివిర్‌లో కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు. తుది అనుమతులు లభించిన వెంటనే రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారి విస్తరణతో ప్రయాణ సమయం తగ్గడంతోపాటు రోడ్డు భద్రత మెరుగుపడుతుందని, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని వివరించారు.

**ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగ భూ సేకరణ పూర్తి**

రాష్ట అభివృద్ధికి అత్యంత కీలకమైన ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. సంగారెడ్డినర్సాపూర్‌తూప్రాన్‌గజ్వేల్‌జగదేవ్‌పూర్ భువనగిరిచౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ మేర నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు గతంలో రెండుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ భూసేకరణ పూర్తికాక రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కూడా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఉత్తర భాగానికి త్వరితగతిన ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదాలు లభించాలని గడ్కరీని కోరినట్లు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి దక్షిణ ఆర్ఆర్ఆర్ కీలకంగా మారుతుందని వివరించారు.

**గ్లోబల్ సమ్మిట్ స్థాయిలో ఐఆర్‌సీ నిర్వహణ**

ఐఆర్‌సీని ఒక సమావేశంగా కాక తెలంగాణ రహదారుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు భద్రత, పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని, ప్రతి విభాగం బాధ్యతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఐఆర్‌సీ సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, ఐఆర్‌సీ డైరెక్టర్ సురేందర్ గర్గ్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఎంవోఆర్‌టీహెచ్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ చీఫ్ ఇంజనీర్లు ధర్మారెడ్డి, వసంత్ నాయక్, బి.వి.రావు, నర్సింగరావు, పలువురు ఆర్ అండ్ బీ ఇంజనీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఎన్‌హెచ్-765పై మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్-765లోని నల్లమల అటవీ ప్రాంతంలో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం అనుమతులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. సుమారు రూ.7,600 కోట్ల అంచనాతో 52 కి.మీ మేర సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమైందని తెలిపారు. టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఈ ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణంతోపాటు నల్లమల అటవీ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని వివరించారు. ప్రాజెక్టుకు కేంద్రస్థాయిలో అవసరమైన ఆమోదాలు త్వరగా లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# సమాచార హక్కు చట్టం ప్రజా-స్వామ్యపు హృదయ స్పందన

- **గవర్నర్ శివప్రతాప్ శుక్లా**
- **సమాచార దర్పణం బ్రోచర్ ఆవిష్కరణ**

**హైదరాబాద్, సిరి న్యూస్ అక్టోబర్ 9 :**

సమాచార హక్కు చట్టం ఒక చట్టం మాత్రమే కాదని, అది మన ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన వంటిదని, పారదర్శకత, జవాబుదారీతనం, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి బలమైన పునాది అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాలలో భాగంగా రవీంద్రభారతిలో రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 2005లో అమలులోకి వచ్చిన చరిత్రాత్మక ఈ చట్టం ద్వారా సామాన్య పౌరులు పాలనా వ్యవస్థను ప్రశ్నించి, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా కోరే అధికారం పొందారని తెలిపారు. సమాచార హక్కు కింద దాఖలయ్యే ప్రతి దరఖాస్తు ఒక కాగితం లేదా దరఖాస్తు మాత్రమే కాదని, దాని వెనుక ఒక సమస్య, హక్కుల కోసం విన్నపం లేదా న్యాయం కోసం చేసే ప్రయత్నం ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు. అందువల్ల ఈ చట్టం విజయాన్ని కేవలం దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కార సంఖ్యతోనే కాక పరిపాలనా విధానాల్లో తీసుకొచ్చే శాశ్వతమైన, పారదర్శకమైన మార్పులతో అంచనా వేయాలని సూచించారు. ఈ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) కింద ముందస్తు సమాచార వెల్లడి అత్యంత కీలకమని, అది ఈ చట్టానికి ఆత్మ వంటిదని గవర్నర్ అభివర్ణించారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతోపాటు నిరంతరం ప్రచారం చేయాలని సూచించారు. తద్వారా అవసరమైన సమాచారం కోసం ప్రజలు సమాచార హక్కు దరఖాస్తులు దాఖలు చేయాల్సిన అవసరం కూడా తగ్గుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, మహిళలు, దివ్యాంగులు, సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సమాచార హక్కు చేరేలా చూడటం అందరి సమష్టి బాధ్యత అని స్పష్టం చేశారు. డిజిటల్ యుగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా విశ్లేషణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా, సమ్మిళిత పద్ధతిలో వినియోగించడం ద్వారా సమాచార వ్యవస్థలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సరైన మార్గదర్శకత్వం అందించడం, సుపరిపాలనను బలోపేతం చేసేందుకు తెలంగాణ సమాచార కమిషన్ చేస్తున్న కృషిని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా సమాచార కమిషన్ రూపొందించిన వార్తాపత్రిక 'సమాచార దర్పణం'ను గవర్నర్ ఆవిష్కరించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ సమాచార హక్కు ప్రతిజ్ఞ చేయించారు.

**15 నెలల్లో 30 వేల కేసులకు గాను 21 వేల కేసులు పరిష్కారం**

రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కేవలం 15 నెలల్లో 30 వేల కేసులకు గాను 21 వేల కేసులను కమిషన్ పరిష్కరించిందని తెలిపారు. 24 శాఖల్లో పెండింగ్‌ను దాదాపు సున్నా స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. తక్షణ సమాచారాన్ని ఆశించే నేటి యువత, ముఖ్యంగా జెన్‌జెడ్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ విభాగాలు సమాచారాన్ని ముందుగానే ప్రజలకు అందించాలన్నారు. చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం తప్పనిసరిగా చేపట్టాల్సిన స్వచ్ఛంద సమాచార వెల్లడి, సమర్థవంతంగా పనిచేసే ఆన్‌లైన్ సమాచార హక్కు పోర్టల్ ద్వారా ప్రజలకు సమాచారం సులభంగా అందుబాటులోకి రావాలని ఆయన సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్ పరిపాలన వంటి అధిక భారంతో పనిచేసే శాఖల్లో అనవసర వ్యాజ్యాలను తగ్గించడంతోపాటు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, మహిళల సమాచార హక్కు వినియోగంలో భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి.శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్ల, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సమాచార హక్కు అవార్డుల ప్రదానం**

ఉత్తమ స్వచ్ఛంద సమాచార వెల్లడి విభాగంలో నల్గొండ కలెక్టర్ చంద్రశేఖర్, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, టీజీ జెన్‌కో సీఎండీ హరీష్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన శాఖాధిపతి విభాగంలో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఉత్తమ పనితీరు కనబరిచిన సచివాలయ శాఖ విభాగంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలు అవార్డు అందుకున్నారు. ఉత్తమ ప్రజా సమాచార అధికారి విభాగంలో ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి రామమూర్తి, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ నసీర్, మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి అవార్డులు అందుకున్నారు. ప్రత్యేక విభాగంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రామగుండం తహసీల్దార్ రవీందర్ అవార్డులు అందుకున్నారు.

# 45 ఎకరాల అసైన్డ్ భూమి లెక్కల్లో తేడా

**మొదటిపేజీ తరువాయి**

దృష్టి సారించారు. ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల పరిధిలో పూర్తిస్థాయి రీ-సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. భూముల యాజమాన్య హక్కులు, సరిహద్దులు, పాత రికార్డులను పరిశీలించి వ్యత్యాసానికి కారణాలను గుర్తించనున్నారు.

ఈ ప్రక్రియలో భాగంగా కేసీఆర్ కుటుంబ సభ్యుల నుంచి భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, పాత రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించే అవకాశం ఉంది. 45 ఎకరాల భూమి ప్రభుత్వ లేదా అసైన్డ్ భూమిగా నిర్ధారణ అయితే, నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయడం లేదా తెలంగాణ అమరుల కాలనీకి కేటాయించడం వంటి చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, ఈ భూమి కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిధిలోకి వచ్చిందా, అసలు వ్యత్యాసానికి కారణమేంటనే అంశాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

**ధరణి వ్యవహారంపై రాజకీయ విమర్శలు**

ధరణి పోర్టల్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూ రికార్డుల్లో అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ నేతలు గతంలో పలుమార్లు ఆరోపించారు. తాజాగా ఎర్రవల్లి భూముల లెక్కల్లో తేడా అంశం తెరపైకి రావడంతో ఈ విమర్శలకు మరింత బలం చేకూరిందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, తమ భూములన్నీ చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని, ప్రభుత్వం రాజకీయ కక్షతోనే ఈ వివాదాన్ని తెరపైకి తెస్తోందని బీఆర్ఎస్ నేతలు వాదిస్తున్నారు.

**రీ–సర్వేతో తేలనున్న వాస్తవాలు**

ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో అధికారికంగా రీ-సర్వే చేపట్టి, భూముల సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డులను సరిపోల్చిన తర్వాతే ఈ వివాదంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



నోటీసుల జారీ, విచారణ, భూముల స్వాధీనం వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి. ఈ వ్యవహారం అధికారిక విచారణ దశలో ఎలాంటి మలుపులు తిరుగుతుందన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# భారత మూలాలున్న మహిళకు నోబెల్ శాంతి పురస్కారం

- **దక్షిణాఫ్రికాకు చెందిన నవీ పిళ్లై ఎంపిక**

**ఢిల్లీ, అక్టోబర్ 9 :**



దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది, భారత మూలాలున్న నవనీతం నవీ పిళ్లైను 2026 సంవత్సరం ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం లభించింది. శాంతి, అంతర్జాతీయ చట్టాలను ప్రోత్సహించడానికి కృషి చేసినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నవనీతమ్ అంతర్జాతీయంగా మానవ హక్కుల కోసం విశేషంగా కృషి చేశారు. ఈమె పూర్వీకులు తమిళనాడుకు చెందిన వారు కాగా చాలా ఏళ్ల క్రితం అక్కడినుంచి దక్షిణాఫ్రికాకు వలస వెళ్లారు. ఆమె పూర్వీకులు 1890లో దక్షిణాఫ్రికాలోని చక్కెర తోటలలో పనిచేయడానికి ఒప్పంద సేవకులుగా భారతదేశం నుంచి వెళ్లారు. దక్షిణాఫ్రికాలో లా ప్రాక్టీస్ చేసిన తొలి భారతీయ సంతతి మహిళల్లో ఒకరుగా, 1995లో ఆ దేశ హైకోర్టులో నియమితులైన తొలి నల్లజాతి మహిళా న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. రువాండా అంతర్జాతీయ నేర న్యాయస్థానం(ఐసీసీ) న్యాయమూర్తి (20032008)గా, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమిషనర్ (20082014)గా పనిచేశారు. ఈమె తల్లిదండ్రులు శాంతమ్మ నాయుడు, నారాయణస్వామి నాయుడు. 1941 సెప్టెంబర్ 23న ఈమె దక్షిణాఫ్రికాలోని నాటల్ ప్రావిన్స్‌లోని డర్బన్‌లో జన్మించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘర్షణలు దౌత్యం, ఒప్పందాలు, చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కారం అవుతున్నాయని నార్వే నోబెల్ కమిటీ పేర్కొంది. మరింత శాంతియుత ప్రపంచానికి అంతర్జాతీయ చట్టం ఓ పునాది అని, ప్రస్తుతం అనేక సంఘర్షణలు, సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ఇది అత్యంత అవసరమని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది. గతేడాది వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు కొరినా మచాడోను ఈ నోబెల్ శాంతి బహుమతి వరించిన విషయం విదితమే.



# ఢిల్లీలో 24 గంటల పాటు మొబైల్ ఇంటర్నెట్ నిలిపివేత

- **సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్**
- **అక్టోబర్ 10న నిరసనకు పిలుపు**
- **జన్‌పథ్–కర్తవ్య పథ్ కూడలి చుట్టూ 4 కి.మీ. పరిధిలో ఆంక్షలు**
- **భద్రతా చర్యల్లో భాగంగా మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దీ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో నిరసనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంతో పాటు ఢిల్లీకి వచ్చే కొన్ని రైళ్లను రద్దు చేసినట్లు సమాచారం. జంతర్ మంతర్ పరిసరాల్లో నిరసన నేపథ్యంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను 24 గంటల పాటు నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. జన్‌పథ్-కర్తవ్య పథ్ కూడలి నుంచి నాలుగు కిలోమీటర్ల పరిధిలో అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ఈ సమయంలో అన్ని రకాల మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిచిపోనున్నాయి. కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.



# నదిలో నూతన దంపతుల మృతదేహాలు

- **మహారాష్ట్రలోని తాపి నదిలో వెలుగుచూసిన ఘటన**
- **ప్రేమ వివాహం చేసుకున్న కొన్ని నెలలకే విషాదం**
- **హత్యా, ఆత్మహత్యా అనే కోణాల్లో పోలీసుల దర్యాప్తు**

**ధూలే, అక్టోబర్ 9:**

మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో తీవ్ర కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. కాళ్లకు ఇనుప గొలుసులు, తాళం వేసి ఉన్న స్థితిలో నూతన దంపతుల మృతదేహాలు తాపి నదిలో లభ్యమయ్యాయి. ఈ ఘటన వెనుక హత్య ఉందా? లేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**నదిలో మృతదేహాల గుర్తింపు**

పోలీసుల కథనం ప్రకారం.. తాపి నదిలో యువతీ యువకుల మృతదేహాలు తేలుతుండటాన్ని ఉదయం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను బయటకు తీశారు. ఇద్దరి కాళ్లకు ఇనుప గొలుసులు వేసి, తాళం బిగించి ఉండటాన్ని గుర్తించారు. వారి ద్విచక్ర వాహనం కూడా నది ఒడ్డున లభ్యమైంది.

**కొన్ని నెలల క్రితమే ప్రేమ వివాహం**

మృతులను ధూలే జిల్లాలోని అమల్నేర్ తాలూకా పడల్సారే గ్రామానికి చెందిన శ్యామ్ హరి పాటిల్ (28), సప్నా శ్యామ్ పాటిల్ (20)గా గుర్తించారు. వీరు కొన్ని నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నారని, ఉట్రాన్ గ్రామంలో నివసిస్తున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే, కొంతకాలంగా వారు ఇంట్లో కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. దంపతుల కాళ్లకు గొలుసులు ఎవరు వేశారు? వారిని నదిలోకి తోసేశారా? లేక వారే ఈ చర్యకు పాల్పడ్డారా? అనే అంశాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

# ఢిల్లీని చుట్టుముట్టిన భద్రతా వలయం

- **సీజేపీ నిరసన నేపథ్యంలో 40 వేల మంది పోలీసులతో భద్రత**
- **57 మెట్రో స్టేషన్ల మూసివేతకు పోలీసుల ప్రతిపాదన**
- **నిజాముద్దీన్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లలో ఆంక్షలు**
- **పలు కీలక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు**
- **భద్రతపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్షలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**



ఓట్ చోరీ ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న తలపెట్టిన నిరసనతో దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నగర వ్యాప్తంగా సుమారు 40 వేల మంది పోలీసులను మోహరించినట్లు సమాచారం. హోటళ్లు, షెల్టర్లలో తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద కదలికలపై నిఘా పెట్టారు. పలు రవాణా సేవలపై కూడా ఆంక్షలు విధించారు.

రైల్వేశాఖ హజ్రత్ నిజాముద్దీన్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లలో అక్టోబర్ 10 మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంక్షలు విధించింది. నిరసన నేపథ్యంలో గోరఖ్‌ధామ్ ఎక్స్‌ప్రెస్, లక్నో మెయిల్, ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ వంటి పలు రైళ్లను రద్దు చేసినట్లు సమాచారం.

**మెట్రోపై ఆంక్షలకు సుప్రీంకోర్టు సూచనలు**

ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను అక్టోబర్ 9 రాత్రి 9 గంటల నుంచే మూసివేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు పోలీసులు లేఖ రాశారు. అయితే, నిరసనలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రాకపోకలను పూర్తిగా నిలిపివేయరాదని సుప్రీంకోర్టు సూచించింది. పోలీసుల ఆంక్షలపై అభ్యంతరాలుంటే నిరసన నిర్వాహకులు అత్యవసర పిటిషన్ దాఖలు చేయవచ్చని పేర్కొంది.

**భద్రతపై అమిత్ షా సమీక్షలు**

ఇటీవల నీట్ అవకతవకలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన నిరసనలో హింస చోటుచేసుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజా ఆందోళనపై దృష్టిసారించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలో భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

మరోవైపు, జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 అమల్లో ఉందని, అందువల్ల నిరసనకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

# నందిగ్రామ్‌లో బీజేపీ చారిత్రక విజయం

- **1,22,553 ఓట్ల భారీ మెజారిటీతో హసీ రాణి రథ్ గెలుపు**
- **1967 తర్వాత అత్యధిక విజయ మార్జిన్‌గా రికార్డు**
- **కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌పై ఘన విజయం**
- **చంద్రనాథ్ రథ్ తల్లికి ఉప ఎన్నికల్లో పట్టం కట్టిన ఓటర్లు**
- **రెజీనగర్‌లోనూ బీజేపీకి భారీ ఆధిక్యం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**



పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి హసీ రాణి రథ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌పై 1,22,553 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు. 1967 తర్వాత ఈ నియోజకవర్గంలో ఇదే అత్యధిక విజయ మార్జిన్‌గా నమోదైంది. రెజీనగర్ అసెంబ్లీ స్థానంలోనూ బీజేపీ అభ్యర్థి 75 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంలో ఉన్నట్లు సమాచారం.

నందిగ్రామ్‌లో హసీ రాణి రథ్‌కు 1,64,227 ఓట్లు రాగా, మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు వచ్చాయి. దీంతో ఇద్దరి మధ్య ఓట్ల తేడా 1,22,553గా నమోదైంది. గతంలో 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సువేందు అధికారి 81,230 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తాజా ఫలితంతో ఆ రికార్డు బద్దలైంది.

**చంద్రనాథ్ రథ్ తల్లికి విజయం**

హసీ రాణి రథ్.. సువేందు అధికారి సన్నిహితుడైన చంద్రనాథ్ రథ్ తల్లి. ఈ ఏడాది మే 6న ఉత్తర 24 పరగణాల జిల్లాలోని మధ్యమ్‌గ్రామ్‌లో చంద్రనాథ్ రథ్ కాల్పుల్లో హత్యకు గురయ్యారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఆయన తల్లి నందిగ్రామ్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సువేందు అధికారి సీటు వదలడంతో ఉప ఎన్నిక**

2026 అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ నియోజకవర్గంలోనూ విజయం సాధించారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన భవానీపూర్ స్థానాన్ని సువేందు అధికారి ఎంచుకోవడంతో నందిగ్రామ్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. తాజా ఫలితంతో ఈ నియోజకవర్గంలో బీజేపీ తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది.



## ఎన్నికల ఫలితాలు మోదీ నాయకత్వంపై విశ్వాసానికి నిదర్శనం: అమిత్ షా

- **పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ విజయాలపై హర్షం**
- **రాజస్థాన్, త్రిపుర మున్సిపల్ ఫలితాల్లో ఎన్డీయేకు ఆధిక్యం**
- **ఇండియా కూటమిని ప్రజలు తిరస్కరించారన్న కేంద్ర హోంమంత్రి**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఉప ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వాగతించారు. రాజస్థాన్, త్రిపుర మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీయే సాధించిన ఫలితాలపైనా హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాలు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉప ఎన్నికల ఫలితాల అనంతరం ఎక్స్ వేదికగా స్పందించారు.

**విపక్షాల ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదు**

రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారం మధ్య కూడా ప్రజలు మోదీ నాయకత్వంపై నమ్మకంతో బీజేపీకి మద్దతు ఇస్తున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇండియా కూటమిని ప్రజలు తిరస్కరిస్తున్నారనడానికి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల్లో మద్దతు కోల్పోతున్న విపక్షాలు ప్రతి ఓటమి తర్వాత ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయని విమర్శించారు.

**బీజేపీ నేతలకు అభినందనలు**

విపక్షాల వైఖరిని ప్రజలు గుర్తించారని, అందుకే మరోసారి బీజేపీకి మద్దతు తెలిపారని అమిత్ షా పేర్కొన్నారు. తాజా విజయాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, రాజస్థాన్, త్రిపుర ముఖ్యమంత్రులతో పాటు పుదుచ్చేరి నాయకులకు, ఆయా రాష్ట్రాల బీజేపీ నేతలకు అభినందనలు తెలిపారు.

# ఎస్ఐఆర్, సీఈసీ వ్యవహారంపై రాష్ట్రపతికి ఇండియా కూటమి ఫిర్యాదు

- **ద్రౌపది ముర్మును కలిసిన 10 మంది కూటమి నేతలు**
- **ఎన్నికల కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు, అంతర్గత విభేదాలపై ఫిర్యాదు**
- **రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీగా వెళ్లిన విపక్ష నేతలను అడ్డుకున్న పోలీసులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఫిర్యాదు చేశారు. కూటమికి చెందిన పది మంది నాయకులు రాష్ట్రపతిని కలిసి ఎన్నికల కమిషన్ ఏకపక్ష నిర్ణయాలు, ఎస్ఐఆర్ పరిణామాలు, ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలను వివరించారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, సుప్రియా సూలే, ఎంఏ బేబీ, మనోజ్ ఝా, డి.రాజా, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, రాజీవ్ రాయ్, తిరుమావళవన్ ఉన్నారు.

**రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీ**

అంతకుముందు పార్లమెంటు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో సమావేశమైన ఇండియా కూటమి నేతలు అక్కడి నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ర్యాలీగా బయలుదేరారు. మమతా బెనర్జీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు మహిళా నేతలు కూడా ఇందులో పాల్గొన్నారు. అయితే మార్గమధ్యంలో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం విజయ్ చౌక్ వద్ద ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ సహా పలువురు ఎంపీలు నేలపై కూర్చుని సీఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**నెహ్రూ ప్రసంగాన్ని గుర్తుచేసిన రాహుల్**

సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ, 1947 ఆగస్టు 14న పార్లమెంటు సెంట్రల్ హాలులో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన చారిత్రక ప్రసంగాన్ని ప్రస్తావించారు. స్వాతంత్ర్యం దేశానికే కాకుండా యావత్ ఆసియా, ప్రపంచానికి కీలక ఘట్టమని నెహ్రూ పేర్కొన్న విషయాలను గుర్తుచేశారు. స్వేచ్ఛకు ప్రతీకగా ఉదయించిన ఆశల నక్షత్రం ఎప్పటికీ అస్తమించకూడదన్న ఆయన సందేశాన్ని ప్రస్తావించారు. ఈ సమావేశానికి ఖర్గే, రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి నేతలు హాజరయ్యారు.

**ప్రభుత్వాన్ని తొలగించడమే పరిష్కారం: రాహుల్**

రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీగా వెళ్లడానికి ముందు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారం కంటే పెద్ద సమస్య ప్రస్తుత ప్రభుత్వమని, దానికి పరిష్కారం ప్రభుత్వాన్ని తొలగించడమేనని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు గత కొన్ని రోజులుగా కొనసాగిస్తున్న ఒత్తిడితో ప్రభుత్వ పునాదులు కదిలాయని, ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులను కలవడానికి నిరాకరించే ధైర్యం సీఈసీకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్‌ను కేవలం ఒక సేవలందించే వ్యక్తిగా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు.

# మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు అభ్యంతరం

- **సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ నిరసన పిలుపు**
- **57 మెట్రో స్టేషన్ల మూసివేత నిర్ణయంపై కోర్టు అసంతృప్తి**
- **ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయొద్దని సూచన**
- **నిరసనలకు ప్రత్యామ్నాయ వేదిక పరిశీలిస్తామన్న కేంద్రం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**



ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు విధించిన ఆంక్షలపై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలన్న పోలీసుల నిర్ణయంపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం వల్ల సాధారణ పౌరుల హక్కులకు విఘాతం కలుగుతుందని పేర్కొంది.

**ఆంక్షలు ప్రజలకు భారంగా మారొద్దు**

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసనలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని, అయితే వాటి ప్రభావం సామాన్య ప్రజలపై పడకుండా చూడాలని సూచించింది. "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించకూడదు" అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సీజేఐ వ్యాఖ్యానించారు. మెట్రో రైళ్ల రాకపోకలను పూర్తిగా నిలిపివేయకుండా తగిన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ వేదికపై కేంద్రం పరిశీలన**

జంతర్ మంతర్‌కు బదులుగా నిరసన నిర్వహించేందుకు మరో ప్రదేశాన్ని కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని కోరింది. నిరసన తెలిపే హక్కుతో పాటు పౌరుల ప్రయాణ స్వేచ్ఛ, ప్రజా రవాణా వినియోగం, ప్రాథమిక సౌకర్యాలకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందని కోర్టు స్పష్టం చేసింది.

# జిల్లా ఏర్పడినా
# తీరని గోస!



## పదేళ్ల సంగారెడ్డి.. ప్రగతి పరుగులా? సమస్యల ముసురా?
## అక్టోబర్ 11తో జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తి
## పరిశ్రమలతో దూసుకుపోతున్న జిల్లా..

ప్రత్యేక జిల్లా ఏర్పాటైతే పరిపాలన ప్రజల ముంగిటకు చేరువవుతుందని, పల్లెల రూపురేఖలు సమూలంగా మారి ప్రగతి పరుగులు పెడుతుందని ఆశించిన సంగారెడ్డి జిల్లా ప్రజల ఆకాంక్షలు నేటితో దశాబ్ద కాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్నాయి. 2016 అక్టోబర్ 11న ప్రత్యేక అస్తిత్వాన్ని సంతరించుకున్న ఈ జిల్లా మరో మూడు రోజుల్లో పదేళ్ల మైలురాయిని అధిగమించనుంది. హైదరాబాద్ మహానగరానికి ఆనుకుని ఉండటం, జాతీయ రహదారుల అనుసంధానం, నిరంతర పెట్టుబడులతో రాష్ట్ర ఆర్థిక చిత్రపటంలోనే జిల్లా ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా నిలిచింది. అయితే ఈ పదేళ్ల ప్రగతి ఫలాలు పల్లెల్లోని సామాన్యుడి జీవితాల్లోకి ఎంతవరకు ఇంకాయన్న ప్రాథమిక ప్రశ్న ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. (సంగారెడ్డి - సిరి న్యూస్)

- అయినా స్థానిక యువతకు అందని ఉద్యోగ అవకాశాలు
- విషతుల్యమైన భూగర్భ జలాలు.. పొంచివున్న కాలుష్య ముప్పు
- పూర్తికాని ప్రాజెక్టులు.. నష్టాల ఊబిలోనే సాగుతున్న వ్యవసాయం
- కలెక్టరేట్ ముంగిట పేరుకుపోతున్న పరిష్కారంకాని సమస్యల అర్జీలు
- వైద్య కళాశాల వచ్చినా వీడని స్పెషలిస్ట్ వైద్యుల కొరత
- పారిశ్రామిక రోడ్లకే ప్రాధాన్యం..
- అటకెక్కిన గ్రామీణ రహదారుల మరమ్మతులు
- నిరుపేదలకు అందని ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమం

### ప్రగతి మాటున కాలుష్యపు కాటు..

జిల్లా సాధించిన పారిశ్రామిక ప్రగతి మాటున ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు పర్యావరణ కాలుష్యం. పటాన్‌చెరు, జిన్నారం పరిసరాల్లోని గ్రామాలు నిత్యం రసాయన వ్యర్థాల దుర్గంధంతో బతుకువెళ్లదీస్తున్నాయి. వ్యర్థాలను శుద్ధి చేయకుండా యథేచ్ఛగా భూమిలోకి, వాగుల్లోకి వదులుతుండటంతో కన్నాని కుంట, నక్కవాగు, కిష్టారెడ్డిపేట తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు విషతుల్యమై వ్యవసాయానికే కాకుండా తాగడానికి కూడా పనికిరాకుండా పోయాయి. వర్షాలు కురిసిన వేళల్లో రసాయన జలాలను చెరువుల్లోకి వదులుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెడుతున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ రసాయన కాలుష్యం మూలంగా పరిసర గ్రామాల ప్రజలు క్యాన్సర్, చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యల బారిన పడుతున్నారు.




### పారిశ్రామిక విప్లవం..స్థానికులకు దక్కని కొలువులు..

పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, జిన్నారం, గుమ్మడిదల, జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతాలు ఔషధ, భారీ ఇంజనీరింగ్, రసాయన, ఆటోమొబైల్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక హబ్‌లుగా విస్తరించాయి. వందలాది బహుళజాతి కంపెనీలు కొలువుదీరి కోట్లాది రూపాయల సంపదను సృష్టిస్తున్నప్పటికీ, స్థానిక యువతకు మాత్రం ఉద్యోగాల లబ్ధి దక్కడం లేదు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలన్న నిబంధనలు కాగితాలకే పరిమితం కాగా, సాంకేతిక నైపుణ్యాల కొరత సాకుతో యాజమాన్యాలు ఇతర రాష్ట్రాల వారికే ప్రాధాన్యమిస్తున్నాయి. స్థానిక యువతకు ఆధునిక పరిశ్రమలకు తగ్గ నైపుణ్యాలను నేర్పించే శిక్షణా కేంద్రాలు నామమాత్రంగా మారడంతో వేలాది మంది ఇంజనీరింగ్, డిగ్రీ పట్టభద్రులు పరిశ్రమల గేట్ల ముందే సెక్యూరిటీ గార్డులుగా, ఒప్పంద కూలీలుగా మిగిలిపోతున్నారు.

### అన్నదాతల గోస.. అటకెక్కిన ప్రాజెక్టులు

వ్యవసాయ రంగం విషయానికి వస్తే సంగారెడ్డి జిల్లాలో సాగునీటి వసతి ఇంకా వర్షాధారంగానే మిగిలింది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించే దిశగా కొలిక్కి రాలేదు. దీంతో నారాయణఖేడ్, కల్హేర్, మునిపల్లి, జహీరాబాద్ మెట్ట ప్రాంతాల్లో రైతులు బోరుబావులపైనే ఆధారపడి పత్తి, సోయాబీన్, చెరకు, కంది పంటలను సాగు చేస్తూ తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులతో పాటు కల్తీ విత్తనాలు, మార్కెట్లలో గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతన్నలు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధికారులు సకాలంలో సర్వేలు జరిపి పంట నష్టపరిహారం అందించే శాశ్వత వ్యవస్థ జిల్లాలో ఇప్పటికీ కొరవడింది.

### కలెక్టరేట్ చేరువైనా..

పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ అందుబాటులోకి వచ్చి ఉన్నతాధికారులు ప్రజలకు చేరువైనప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంలో ఆశించిన వేగం కనిపించడం లేదు. ప్రతి సోమవారం ప్రజావాణికి వందలాది మంది ప్రజలు మండలాల నుంచి తరలివచ్చి అర్జీలు ఇస్తున్నా, క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల అవి ఎక్కడికక్కడే మూలనపడుతున్నాయి. ప్రధానంగా ధరణి సాంకేతిక సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో గందరగోళం తీరలేదు. వైద్య రంగాన్ని పరిశీలిస్తే జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ వచ్చినా.. జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట ఏరియా ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు లేక అత్యవసర రోగులను హైదరాబాద్‌కే తరలించాల్సి వస్తోంది. అలాగే పారిశ్రామిక రహదారులకే ప్రాధాన్యమిస్తూ గ్రామీణ లింక్ రోడ్లను గాలికొదిలేయడం ప్రయాణికులకు శాపంగా మారింది.

### దశాబ్ది వేళ ప్రజా డిమాండ్..

పదేళ్ల మైలురాయిని చేరుకుంటున్న వేళ సంగారెడ్డి జిల్లా సంబరాలను కేవలం అధికారిక వేడుకలు, ఉపన్యాసాలకే పరిమితం చేయకుండా పాలకులు వాస్తవ పరిస్థితులను సమీక్షించుకోవాలి. జిల్లా ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటివరకు పారిశ్రామికంగా వచ్చిన పెట్టుబడులు, స్థానిక యువతకు దక్కిన వాస్తవ ఉద్యోగాలు, సాగులోకి వచ్చిన ఆయకట్టు, కాలుష్య నియంత్రణకు తీసుకున్న చర్యలపై ప్రభుత్వం శాఖల వారీగా సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలి. పరిశ్రమల సంపద పెరిగినంత మాత్రాన సరిపోదని, పల్లెల్లోని అన్నదాత కళ్లల్లో భరోసా నిండి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించి, సామాన్యుడి జీవనం మెరుగైనప్పుడే పదేళ్ల ప్రత్యేక జిల్లా ప్రస్థానానికి నిజమైన సార్థకత చేకూరుతుంది.




# పేరుకే నిషేధం..
# యథేచ్ఛగా దందా!

## హత్నూర మండలంలో మత్తు కోరల్లో చిక్కుతున్న యువత







## నిషేధం ఉన్నా బహిరంగంగానే పొగాకు దందా
## రూ.15 పొట్లాన్ని రూ.40కి విక్రయం
## చిన్న వయసులోనే మత్తు ఉచ్చులోకి విద్యార్థులు
## కిరాణా, పాన్ డబ్బాలే అడ్డాలు..
## మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల నుంచి అక్రమ రవాణా
## చిరు వ్యాపారులపైనే కేసులు.. సూత్రధారులు మాత్రం సేఫ్
## కొరవడిన పోలీస్, ఫుడ్ సేఫ్టీ నిఘా



సమాజంలో యువతను, శ్రామిక వర్గాలను పెడదోవ పట్టిస్తూ ఆరోగ్యాలను గుల్ల చేస్తున్న ప్రాణాంతక గుట్కా మహమ్మారి మండలంలో యథేచ్ఛగా విస్తరిస్తోంది. కాయకష్టం చేసే కూలీలు, దిగువ మధ్యతరగతి శ్రామికులు అలసటను మర్చిపోయే నెపంతో అలవాటు చేసుకుంటున్న ఈ పొగాకు ఉత్పత్తులు వారి ప్రాణాలనే బలితీసుకుంటున్నాయి. సరదాగా మొదలై అతి తక్కువ కాలంలోనే తీవ్ర వ్యసనంగా మారుతుండటంతో టీనేజర్లు, పాఠశాల స్థాయి విద్యార్థులు సైతం దీని కోరల్లో చిక్కుకుంటున్నారు. నమిలే కొద్దీ నోటి లోపలి చర్మం దెబ్బతిని, పుండ్లు ఏర్పడి చివరకు ప్రమాదకర నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో వినియోగం ఏమాత్రం తగ్గడం లేదు. (హత్నూర సిరి న్యూస్)

### నిషేధం గాలికి.. డబుల్ రేట్లతో దందా...

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పొగాకు, నికోటిన్ కలిగిన గుట్కా, పాన్ మసాలా ఉత్పత్తులపై కఠిన నిషేధం విధించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలవుతున్న దాఖలాలు కానరావడం లేదు. అంబర్, ఆర్ఆర్, పాన్‌బహార్, విమల్, మిరాజ్, సాగర్ వంటి బ్రాండ్లపై నిషేధం ఉండటాన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుని బ్లాక్ మార్కెట్ దందాను నడిపిస్తున్నారు. నిషేధానికి ముందు రూ.15కు లభించిన ఒక్కో అంబర్, ఆర్ఆర్ పొట్లం ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తూ వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు. చిన్న గుట్కా ప్యాకెట్లకు కూడా డిమాండ్ సృష్టించి డబుల్ రేట్లకు అమ్ముతూ అక్రమార్కులు లక్షలాది రూపాయలు గడిస్తున్నారు.

### పాన్ డబ్బాలే అడ్డాలు...

సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్, సిరిపురం, బోరపట్ల, చందాపూర్, పల్పానూర్, గుండ్లమాచనూర్, మల్కాపూర్ తదితర గ్రామాల్లో గుట్కా విక్రయించని కిరాణా దుకాణం లేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రతి పల్లెలోనూ కిరాణా షాపులు, టీ హోటళ్లు, పాన్ డబ్బాల్లో చాక్లెట్ల డబ్బాల మాటున నిషేధిత ప్యాకెట్లను గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలోనే ఈ దందా సాగుతున్నా సంబంధిత అధికారులకు కనబడకపోవడంపై స్థానికులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### సరిహద్దుల నుంచి గుట్టుగా రవాణా...

పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల నుంచి ఈ నిషేధిత సరుకు జిల్లాలోకి అక్రమంగా ప్రవేశిస్తోంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, రాత్రివేళల్లో తిరిగే ప్రైవేట్ వాహనాల్లో రహస్య అరలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున గుట్కా బస్తాలను నియోజకవర్గ కేంద్రాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి మండలాల్లోని చిరు వ్యాపారులకు హోల్‌సేల్‌గా చేరవేస్తున్నారు. ఇంత పెద్ద నెట్‌వర్క్ వ్యవస్థీకృతంగా నడుస్తున్నప్పటికీ, పోలీసులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### చిరు వ్యాపారులపై కొరడా..
### కింగ్‌పిన్లు సేఫ్..

పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎప్పుడైనా దాడులు నిర్వహించినప్పుడు కేవలం పల్లెల్లోని చిన్న కిరాణా షాపుల యజమానులను పట్టుకుని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే వేలాది ప్యాకెట్లను సరఫరా చేస్తూ తెరవెనుక కోట్ల రూపాయల చీకటి సామ్రాజ్యాన్ని నడుపుతున్న అసలు డీలర్లు, హోల్‌సేల్ వ్యాపారులను మాత్రం ముట్టుకోవడం లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మూలాలను వదిలేసి కొమ్మలను నరికినట్లుగా వ్యవహరించడం వల్ల దందా రోజురోజుకూ మరింత విస్తరిస్తోంది.

### ఇకనైనా కఠిన చర్యలు అవసరం..

గ్రామీణ ప్రాంతాల్లో పౌరుల ఆరోగ్యం క్షీణించకుండా ఉండాలంటే ఆహార భద్రతా శాఖ, పోలీస్ యంత్రాంగం సంయుక్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించాలి. మండలంలోని అన్ని కిరాణా, పాన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దు రవాణా మార్గాలపై చెక్‌పోస్టుల నిఘా పెంచాలి. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న అక్రమ గుట్కా వ్యాపారులపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి, ఈ దందాను శాశ్వతంగా అరికట్టాలని హత్నూర మండల ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

# దేవి నవరాత్రులకు ముస్తాబవుతున్న దేవాలయాలు

- **తూప్రాన్ లో ఆదివారం నుండి నవదుర్గ నవరాత్రి ఉత్సవాలు**

**తూప్రాన్ అక్టోబర్ 09 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలోని దేవాలయాలలో నవదుర్గ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు వెంకటాపూర్ వెంకటపట్నంలో శ్రీ శ్రీ శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లను నిర్వహిస్తున్న రవి పంతులు తూప్రాన్ పట్టణంలోని దేవి గార్డెన్ లో సలాక రాజు పంతులు ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు తూప్రాన్ పట్టణంలోని మహంకాళి దేవాలయంలో గత 28 సంవత్సరాలుగా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను వైభవపీతంగా నిర్వహిస్తున్నారు శ్రీ దుర్గాభవాని సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ఆదివారం నుండి 21వ తేదీ బుధవారం వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను వైభవ్వేతంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు 11వ తేదీ ఆదివారం ఉదయం గోపూజ అఖండ దీపారాధన గణపతి పూజ వేద స్వస్తి పుణ్యావాచనము మహా సంకల్పము పంచగవ్య ప్రాశవ దీక్షా స్వీకరణ ధ్వజారోహణము అమ్మవారికి చతుస్ షష్టి పూజ అంకురార్పణ మంట దేవత ప్రధాన కలశ స్థాపన 12వ తేదీ సోమవారం ఉదయం చతుస్ షష్టి పూజ రాత్రి 7 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం మహా లింగార్చన బిల్వర్చన 13 వ తేదీ మంగళవారం రాత్రి శాకాంబరి అలంకరణ 14వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సామాజిక సమరసితా కార్యక్రమం రాత్రి 7 గంటలకు గీతా స్కూల్ విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు 15వ తేదీ గురువారం రాత్రి 6 గంటలకు 16వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు లక్ష కుంకుమార్చన కార్యక్రమం రాత్రి 8 గంటలకు మూలా నక్షత్రం పిల్లలచే సరస్వతి మాత పూజ 17వ తేదీ శనివారం రాత్రి 7 గంటలకు ఉమామహేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం 18వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు లక్షదీపార్చన కాలిక దుర్గాష్టమి సుహాసిని పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు మరియు 19వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మహాబలిదానం మహా పూర్ణాహుతి కార్యక్రమం మహర్నవమి 20వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ మరియు రాత్రి 7 గంటలకు దుర్గా భవాని యూత్ వారిచే మహంకాళి దేవాలయంలో రావణాసుర దహన కాండ తుపాకులసే మల్లె చెట్టు కాల్చే కార్యక్రమం ప్రతిరోజు ఉదయం రుద్ర స్వాహాకార పూర్వక మహా చండీయాగం మరియు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు



# జ్ఞాన్ ఓక్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు




- **మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన నిర్మల జగ్గారెడ్డి, కాట సుధా శ్రీనివాస్ గౌడ్**

**పటాన్ చెరు, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ ఇస్నాపూర్‌లోని జ్ఞాన్ ఓక్ పాఠశాల ప్రాంగణం పూల సోయగాలతో కళకళలాడింది. పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా సాగాయి. ఈ వేడుకలకు టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ పూల పండుగ వైభవాన్ని చాటిచెప్పేలా వేడుకలు సాగాయి.

# విద్యుత్ తీగ తెగిపడి అక్కన్నపేట రైతు శ్రీనివాస్ మృతి





- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్**

**రామాయంపేట, అక్టోబర్ 9 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటనపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ తీగల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఉంటే ఈ దుర్ఘటనను నివారించే అవకాశం ఉండేదని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ సరఫరా వస్తుందని భావించి తన పొలం వద్దకు వెళ్లిన రైతు శ్రీనివాస్‌కు, విద్యుత్ స్తంభంపై ఉన్న తీగ తెగిపడి కింద పడటంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికే రామాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగు చేసిన పంటలు ఎండిపోతూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని రాగి రాములు ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతు ప్రాణం పోయినా స్పందించని విద్యుత్ అధికారులు!**

ఒక రైతు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదని రాగి రాములు ఆరోపించారు. కనీసం బాధిత కుటుంబానికి భరోసా కల్పించాల్సిన బాధ్యతను కూడా అధికారులు విస్మరించారని విమర్శించారు.
ఈ ఘటనపై వివరణ కోరేందుకు రామాయంపేట సబ్‌స్టేషన్‌కు వెళ్లి సిబ్బందితో మాట్లాడిన సమయంలో, అక్కడి ఏడీ వీరయ్య తమతో దురుసుగా మాట్లాడారని, "నాపై కేసులు పెట్టుకోండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని రాగి రాములు ఆరోపించారు. అక్కడికి వచ్చిన గ్రామస్తులు, గ్రామ సర్పంచ్‌తో పాటు తామంతా అధికారుల తీరును తీవ్రంగా వ్యతిరేకించామని తెలిపారు.

**విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరపాలి**

రైతుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న విద్యుత్ తీగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, తెగిపోయిన తీగలు, ప్రమాదకరమైన విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని రాగి రాములు డిమాండ్ చేశారు. రైతు శ్రీనివాస్ మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత నిర్ధారించి సంబంధిత ఏడీ, ఏఈ, లైన్‌మెన్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యే వరకు బాధ్యులపై తగిన చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలోనూ, విద్యుత్ లైన్ల నిర్వహణలోనూ రైతుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య, యాదగిరి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వెంగర్తి రంగయ్య, పాపయ్య గారి నర్సింలు, సాదుల నర్సింలు, బక్కయ్య గారి అరుణ్, చిన్నోళ్ల శేఖర్, పోలీస్ శ్రీను, బాగమ్మ గారి రాకేష్, సారుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# డీఏ బకాయిలు ఒకేసారి చెల్లించాలి!

- **వాయిదాల పద్ధతిని రద్దు చేయాలని ఎస్‌జీటీయూ డిమాండ్**
- **సీపీఎస్ ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కల్పించాలి**
- **పీఆర్ఏఎన్ ఖాతాలకు జమ చేయాల్సిన మొత్తం మినహాయించి మిగిలిన బకాయిలు ఒకే విడతలో ఇవ్వాలి**
- **ఏళ్ల తరబడి బకాయిల కోసం ఎదురుచూసే పరిస్థితి తొలగించాలి**
- **ప్రభుత్వానికి ఎస్‌జీటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ విజ్ఞప్తి**

**సంగారెడ్డి, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**



రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యం (డీఏ) బకాయిలను నెలవారీ వాయిదాల్లో కాకుండా ఒకేసారి చెల్లించాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం (ఎస్‌జీటీయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సంవత్సరాల తరబడి వాయిదాల్లో చెల్లించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే వాయిదాల విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు.
ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెండు డీఏ వాయిదాలను మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వాటికి సంబంధించిన బకాయిలను దీర్ఘకాలిక వాయిదాల్లో చెల్లించాలని నిర్ణయించడం వల్ల సీపీఎస్ ఉద్యోగులకు ఆశించిన స్థాయిలో ఆర్థిక ప్రయోజనం అందదని ఆయన అభిప్రాయపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇతర ఆర్థిక అవసరాలను తీర్చుకోవడం ఉద్యోగులకు భారంగా మారుతోందని తెలిపారు.

**బకాయిల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాలా?**

ఉద్యోగులు తమకు రావాల్సిన డీఏ బకాయిల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండకూడదని ఆకుల ప్రభాకర్ పేర్కొన్నారు. ఉద్యోగుల శ్రమకు ప్రతిఫలంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బకాయిలను ఒకేసారి విడుదల చేస్తే ఉద్యోగులకు తక్షణ ఆర్థిక ఉపశమనం లభించడంతో పాటు కుటుంబ అవసరాలను తీర్చుకునేందుకు వెసులుబాటు కలుగుతుందని వివరించారు.

**పీఆర్ఏఎన్ ఖాతాలకు జమ చేయాల్సిన మొత్తం మినహాయించాలి**

సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిల్లో నిబంధనల ప్రకారం పీఆర్ఏఎన్ ఖాతాలకు జమ చేయాల్సిన మొత్తాన్ని యథావిధిగా జమ చేయాలని, మిగిలిన బకాయిలను నెలవారీ వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకే విడతలో ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఉద్యోగుల హక్కులను కాపాడాలి**

ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వారి హక్కు అని, వాటి చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆకుల ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ
ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని డీఏ బకాయిలను ఒకేసారి చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్‌జీటీయూ సంగారెడ్డి జిల్లా శాఖ తరపున విజ్ఞప్తి చేశారు."మా హక్కు.. మా బకాయిలు! వాయిదాలు వద్దు.. ఒకేసారి చెల్లింపులు కావాలి!" అని ఆకుల ప్రభాకర్ డిమాండ్ చేశారు.

# కుల్కచర్లలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్





- **జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ అదేశాలమేరకు**

**కుల్కచర్ల మండలం, అక్టోబర్,09**

107 మంది పోలీసు సిబ్బందితో తనిఖీలు.. 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 34 లీటర్ల మద్యం స్వాధీనం.. ఇద్దరు రౌడీషీటర్ల తనిఖీ వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా శుక్రవారం (09102026) తెల్లవారుజామున వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఉదయం 5:00 గంటల నుంచి 7:00 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 107 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కుల్కచర్ల గ్రామంలోని కిండిగేరి ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ ఇళ్ల తనిఖీలు, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల పరిశీలన వంటి ముందస్తు నేర నియంత్రణ చర్యలు చేపట్టారు.

**తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నవి:**

54 ద్విచక్ర వాహనాలు: వాహనాల పత్రాలు, సంబంధిత వివరాలను పరిశీలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నారు.
2 ఆటోలు: వాహనాల తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్నారు.
34 లీటర్ల మద్యం: తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు.
ఇద్దరు రౌడీషీటర్ల తనిఖీ: నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లను తనిఖీ చేసి, వారి వివరాలను పరిశీలించారు.ఈ తనిఖీల ద్వారా నేరాలకు అవకాశం కల్పించే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడడం వంటి అంశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.
ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్, మాట్లాడుతూ,సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని డీఎస్పీ వివరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించడం, పోలీసు-ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం,అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం ప్రధాన లక్ష్యమని తెలిపినారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రెడ్డి, కుల్కచర్ల, పరిగి, చెంగోముల్, దోమ, కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, 12 మంది మహిళా పోలీసు కానిస్టేబుళ్లు (WPCలు), ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్





**సదాశివపేట. అక్టోబర్ 9. (సిరిన్యూస్)**

భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కర్ణం ఆదిత్య, యువమోర్చా అధ్యక్షుడు కాశీనాథ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సదాశివపేట మండలంలోని నందికంది గ్రామంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ రాజకీయంలో 25 సంవత్సరాలుగా రాణించడం, నిరంతరం ప్రజాసేవ కార్యక్రమంలో ముందుండే వ్యక్తి నరేంద్ర మోడీ అని అన్నారు. అనంతరం మండలాధ్యక్షుడు కరణం ఆదిత్య మాట్లాడుతూ ఈ రక్త దాన కార్యక్రమంలో సుమారుగా 80 మంది రక్తము ఇవ్వడం జరిగిందన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానమే మిన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొవూరి సంగమేశ్వర్, జిల్లా జనరల్ సెక్రటరీలు మాణిక్ రావు, రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రెసిడెంట్ బొర్రా ప్రవీణ్, బీజేవైఎం స్టేట్ ట్రెజరర్ నరేన్ దేశ్‌పాండే, మండల్ ఇంచార్జ్ ద్వారక రవి, జనరల్ సెక్రటరీలు భరత్, హరీష్, నాయకులు శ్రీకాంత్, సుభాష్, జగన్నాథ్ రెడ్డి, నాగరాజ్, దుర్గారాజ్, వేణు, శ్రీశైలం, ప్రసాద్, పాండు, శేఖర్, మధు, పవన్, ముకేష్, శ్రీకృష్ణ, బూత్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రవికృష్ణలతో పాటు నందికంది గ్రామస్థులు, బిజెపి మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

# పి ఏం శ్రీ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు






- **పూల పండుగతో పులకించిన పాఠశాల ప్రాంగణం**

**వెల్దుర్తి, అక్టోబర్ 09,(సిరి న్యూస్ ):**

పూలను పూజించే పండుగ.. ప్రకృతిని ఆరాధించే వేడుక.. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఆటపాటలకు, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తిలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ నేల అందాలను, పల్లె సంస్కృతిని, పూల పరిమళాలను ఒకచోట చేర్చే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. రంగురంగుల తంగేడు, గునుగు, బంతి, చామంతి, తదితర పూలతో అలంకరించే బతుకమ్మ మన ప్రకృతి వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. పూలను పేర్చి బతుకమ్మను కొలవడం వెనుక ప్రకృతి పట్ల ప్రేమ, జీవన సౌందర్యం, సమాజ ఐక్యత దాగి ఉన్నాయి పాఠశాల ఉపాధ్యాయురాలా బృందం తెలిపారు. *పూలలో పరిమళం.. బతుకమ్మలో సౌభాగ్యం.. తెలంగాణ గుండెల్లో సంస్కృతి.. మన పండుగలో ఆత్మీయత!అన్నట్లుగా బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. చెరువులు, పల్లెలు, వాడవీధులు బతుకమ్మ పాటలతో మార్మోగే ఈ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, మన సంప్రదాయాల గొప్పతనానికి అద్దం పడుతుంది అని సాంబయ్య అన్నారు. పూలను పేర్చితే బతుకమ్మ.. పాటలు పాడితే పండుగ సందడి.. సంప్రదాయాన్ని నిలిపితే తెలంగాణ గౌరవం.. భావితరాలకు అందిస్తే మన సంస్కృతికి చిరంజీవత్వం! అనే సందేశాన్ని ఈ ముందస్తు బతుకమ్మ సంబరాలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నర్సింహా రెడ్డి, అమూల్య, జయసుధ, రాధిక, శైలజ,అర్చన, సునీత, రేణుకాదేవి, ప్రశాంతి దేవి, వెంకటస్వామి, ఖదీర్ పాషా, విజయ్, రాజు, మహేష్ బోధనేతర సిబ్బంది విద్యార్థినీలు పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు.

# సెయింట్ ఆంథోనీస్‌లో బతుకమ్మ సందడి!

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టిన వేడుకలు****
- **రంగురంగుల పూలతో ఆకట్టుకున్న బతుకమ్మలు****
- **సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినీ విద్యార్థుల సందడి****
- **బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీక: డైరెక్టర్ ఈదర విజయ్ రెడ్డి****
- **భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలను అందించడమే లక్ష్యం****



**సంగారెడ్డి, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బతుకమ్మ పండుగను సంగారెడ్డి పట్టణంలోని శాంతి నగర్ సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఈదర సొలొమన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పూల పరిమళాలు, బతుకమ్మ పాటలు, విద్యార్థుల ఆటపాటలతో సందడిగా సాగాయి. పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను విద్యాసంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసి, వాటి చుట్టూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. దీంతో విద్యాసంస్థల ప్రాంగణమంతా తెలంగాణ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

**బతుకమ్మ మన సంస్కృతికి ప్రతీక: ఈదర విజయ్ రెడ్డి**

ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ *ఈదర విజయ్ రెడ్డి* మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధన, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అభివర్ణించారు.

ఆధునిక విద్యతోపాటు విద్యార్థులకు మన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు. భావితరాలకు తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

**ప్రకృతి పరిరక్షణకు బతుకమ్మ సందేశం: ఈదర అరుణ రెడ్డి**

విద్యాసంస్థల ప్రిన్సిపాల్ *ఈదర అరుణ రెడ్డి* మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చడం మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి ప్రేమ, సామాజిక ఐక్యత వంటి విలువలను బతుకమ్మ పండుగ చాటిచెబుతుందని వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగ సంబరాల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో ప్రాంగణమంతా ఆనందోత్సాహాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు, అకడమిక్ కౌన్సిలర్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను ప్రతిబింబిస్తూ బతుకమ్మ సంబరాలు ఘనంగా ముగిశాయి.

# వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- **వృద్ధుల సంక్షేమానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ అక్టోబర్,09(సిరి న్యూస్)**




వయో వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధుల సంక్షేమం,ఆరోగ్య పరిరక్షణ,సామాజిక భద్రత, వారి హక్కుల పరిరక్షణపై కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..వృద్ధుల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని, వారి అనుభవాలను సమాజ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని, కుటుంబ సభ్యులు వృద్ధులకు తగిన ఆదరణ, ప్రేమాభిమానాలు అందించాలని సమావేశంలో పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డిఎల్ఎసి సెక్రెటరీ రుభినా బేగంలు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. వృద్ధులకు మెరుగైన వైద్య సేవలు, సామాజిక భద్రతా పథకాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య,జిల్లా వైద్యాధికారి గనేశ్వర్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి,జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, జిల్లా అధికారులు ,వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మందిరంలో నీ గానమే నా ప్రాణం



**సదాశివపేట. అక్టోబర్ 9. (సిరిన్యూస్)**

నీ గానమే నా ప్రాణము 69వ వేదిక కార్యక్రమాన్ని పురస్కరించుకొని శ్రీ అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ధ్వజారోహణం, గోపూజ, అఖండ దీపారాధన, అఖండ దేవత భజన కార్యక్రమాలు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అయ్యప్ప మందిరం లో సాయంత్రం మహా పడిపూజ కార్యక్రమం మహాప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు కేశవ గురుస్వామి, దేశ్పాండే గురుస్వామి ముఖ్య అతిథులుగా రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గోనె శంకర్ గురుస్వామి, ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్ గురుస్వామి, గురుస్వాములు ఓదెల రవీందర్, చింత గోపాల్, చెన్నాకర్, విశ్వనాథం, శ్రీనివాస్, మరియు అయ్యప్ప స్వాములు విలాస్, అనంతరెడ్డి, పవన్ గౌడ్, ప్రభు, చెన్నయ్య, జయ చింతన్, పలు గ్రామాల భజన మండలి నిర్వహించడమైనది. ఇట్టి కార్యక్రమం హిందూ ధర్మ రక్షణ కొరకై నిర్వహించడమైనదని తెలిపారు.

# తెలంగాణలోని ఆడపడుచులందరికీ అతి పెద్ద పండుగ బతుకమ్మ



- **సర్పంచ్ మోహన్ గౌడ్**

**సదాశివపేట. అక్టోబర్ 9. (సిరిన్యూస్)**

సదాశివపేట మండలంలోని మాచిరెడ్డిపల్లిలో తెలంగాణ పండుగ బతుకమ్మ పండుగను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మోహన్ గౌడ్ రావడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణలోని ఆడపడుచులందరికీ అతి పెద్ద పండుగని, ముఖ్యంగా మహిళలకు బతుకమ్మ పండుగ ప్రధానమైనదని, మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి , బతుకమ్మ ఆడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, పాఠశాల చైర్మన్, అంగన్వాడిటీచర్లు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు యువకులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక ఫోకస్

- **మొదటి విడతలో మొదలు పెట్టని ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి.**
- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు.**
- **మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ అక్టోబర్,09(సిరి న్యూస్)**

జిల్లాలో మొదటి విడతలో మంజూరై ఇంకను మొదలు పెట్టని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి వెంటనే ఇండ్లు నిర్మించుకునే విధంగా విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఎలినో ప్రభావంతో రానున్న వేసవి కాలంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మళ్లించడం, సూపర్ ఎలినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం వివిజిరామ్ పథకం ద్వారా కూలీల సంఖ్య పెంచడం సంబంధిత అంశాలపై ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. అదే విధంగా ఆయా మండలాల పరిధిలో బేస్‌మెంట్ లెవల్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్టెడ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెండో విడతలో అర్హత గల లబ్ధిదారుల జాబితా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.ఈ నెలలో దసరా తర్వాత వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ఎల్ నీ నో ప్రభావం వల్ల రానున్న యాసంగి సీజన్‌కు ప్రమాదం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



- **విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రాపురం, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా, పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ వేడుకలు వి. గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు, మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. సింధు వారితో కలిసి నృత్యాలు చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నాగేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆటపాటలతో బతుకమ్మ వేడుకలు




**మునిపల్లి, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మునిపల్లి మండలం తాటిపల్లి గ్రామంలోని యునైటెడ్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు నూతన వస్త్రాలు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బతుకమ్మ నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తాటిపల్లి మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



**మెదక్ అక్టోబర్,09(సిరి న్యూస్)**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని పిఎంశ్రీ ఉన్నత పాఠశాల కూచన్ పల్లి ప్రధానోపాధ్యాయులు నాచారం మధుమోహన్ అన్నారు. హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని పిఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ కూచన్ పల్లి లో శుక్రవారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బతకమ్మలను పేర్చి విద్యార్థినిలు మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల సంప్రదాయక దుస్తులు అందరిని ఆకర్షించాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్ చెరు పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**పటాన్ చెరు, అక్టోబర్ 9: (సిరి న్యూస్)**

పటాన్ చెరు పట్టణం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు రాలు సంగీత, ఉపాధ్యాయులు పద్మ ప్రసాద్, జీవన లత, శబరి, జ్యోత్స్న ,స్రవంతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తులసి, లక్ష్మమ్మ, పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతుంటే పట్టించుకోరా?

- **రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాల్సిందే!**
- **లక్ష్మాపూర్ స్టేజ్ వద్ద రైతుల ధర్నాకు మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి మద్దతు.**

**రామాయంపేట, అక్టోబర్ 9 (సిరి న్యూస్)**





ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు కీలక సమయంలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు కల్పించడం సరికాదని, మెదక్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయానికి రోజుకు 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని 765డీజీ జాతీయ రహదారిపై లక్ష్మాపూర్ స్టేజ్ వద్ద విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. కాట్రియాల్, లక్ష్మాపూర్, పర్వతాపూర్, దంతేపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. రైతుల నిరసనకు మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి పంట పొట్ట దశలో ఉన్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంటల సాగు కోసం విద్యుత్‌పై ఆధారపడుతున్నారని, ఇలాంటి కీలక సమయంలో కోతలు విధించడం వల్ల వారి కష్టం వృథా అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కాలంటే సకాలంలో సాగునీరు అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రోజుకు 12 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.పంటలు చేతికందే కీలక సమయంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు నష్టపోకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించి, రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రామాయంపేట పిఏసిఎస్ చైర్మన్ బాధే చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు పార్టీ సీనియర్ నాయకుడు రైతులు, సర్పంచులు,మాజీ సర్పంచ్లు,మాజీ ఎంపీటీసీలు, పట్టణ,మండల నాయకులు రాగి ఉమా మహేశ్వర్ ,మాజీ సర్పంచులు సుభాష్, శ్యామ్ మాజీ ఎంపిటిసి మైస గౌడ్, దంతపల్లి మాజీ సర్పంచ్ సురేష్, నాయకులు సత్య పాల్, ప్రభాకర్ ,నరేందర్ రెడ్డి ,శ్రీకాంత్ సాగర్ ,శ్రావణ్ కుమార్ ,శ్యామ్ రెడ్డి, లక్ష్మణ్, బాబు, కిషన్,సంతోష్ యువజన నాయకులు రవి,వసంత్ రమేష్,గణేష్,మోహన్ నగేష్ తదితరులు పాల్గొన్నారు

# పలు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**పెద్దశంకరంపేట,అక్టోబర్ 09, (సిరి న్యూస్)::**



పెద్దశంకరంపేట మండల కేంద్రంలోని డాన్ బాస్కో , స్కూల్, ప్రభుత్వ7 బాలికల ఉన్నత పాఠశాల, సాయి చైతన్య ఉన్నత పాఠశాల లో శుక్రవారం నాడు బతుకమ్మ పండుగ ముందస్తు వేడుకలను అత్యంత వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, సంప్రదాయ దుస్తులు ధరించి, పాఠశాల ప్రాంగణంలో . బతుకమ్మ ఆడారు. పలు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ, ఆట పాటలతో స్కూల్ ఆవరణల్లో సందడి చేసారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్, హెడ్ మాస్టర్ లు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, పూల పండుగ బతుకమ్మకు విశిష్టమైన గుర్తింపు ఉందన్నారు. విద్యార్థుల్లో మన ఆచార వ్యవహారాలు, సంస్కృతిపై అవగాహన, గౌరవం పెంపొందించేందుకే ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నేటి తరానికి మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మంజీరా విద్యాలయంలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం






**రామాయంపేట, అక్టోబర్ 9( సిరి న్యూస్)**

రామాయంపేట పట్టణములోనీ మంజీరా విద్యాలయంలో శుక్రవారం నాడు ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ప్రకృతిని ఆరాధించే పండగ బతుకమ్మ పండగ .పూలు బాగా వికసించే కాలంలో జలవనరులు, సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. స్త్రీలు బొడ్డెమ్మను దశమి రోజు నుంచి ఆరంభిస్తారు. మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మలను బతుకమ్మతోపాటు నిమజ్జనం చేస్తారు. బృహతమ్మ నుంచి శివలింగాన్ని వేరు చేసినందుకుగాను తమ దుఃఖాన్ని చోళులకు తెలియజేస్తూ మేరు పర్వతంలో పూలను పేర్చి బతుకమ్మను నిర్వహించడం మొదలుపెట్టారు. తెలంగాణ వాసులు అలా ప్రతి ఏడాది బతుకమ్మను జరపడం ఆనవాయితీగా దాదాపు వేయి సంవత్సరాల నుంచి బతుకమ్మను తెలంగాణవాసులు జరుపుకుంటున్నారు. ఆడపిల్లలు అందరూ ఒకచోట చేరి తీరొక పూలతో అందంగా పేర్చేది బతుకమ్మ. మొదటి రోజు అమావాస్య రోజు జరుపుకునే బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మని, రెండవ రోజు అటుకుల బతుకమ్మని, మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మని, నాలుగవ రోజు నాన్న బియ్యం బతుకమ్మని, ఐదవరోజు అట్ల బతుకమ్మ అని ,ఆరవ రోజు అలిగిన బతుకమ్మ అని ,ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ అని ,ఎనిమిదవ రోజు వెన్న ముద్దల బతుకమ్మ అని ,చివరి తొమ్మిదవ రోజున సద్దుల బతుకమ్మ అని సద్దులు కలిపి నైవేద్యంగా పెట్టడం జరుగుతుంది. ఊరువాడ అంతా కలిసి ఉత్సాహంగా జరుపుకునే పండుగ . ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తులలో వచ్చి బతుకమ్మలను తీరొక ఆకృతిలో పేర్చడం జరిగింది . తులసి కోట ఆకారంలో, శివలింగం, ఆకారంలో, దుర్గా స్వరూపిణి ,నవ అలంకారాలలో విద్యార్థులందరూ బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో పేర్చడం జరిగింది. పిల్లలందరూ బతుకమ్మలు ,కోలాటాలు ఆడి చివరికి బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. విద్యార్థినీ విద్యార్థులు దుర్గామాత ఆకృతిని చక్కగా గీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సురేష్, కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి వాసవి, సుస్మిత , శిరీష సంధ్య,అనిల్ శ్రీశైలం శ్రీనిత పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన భావితరాలకు మన సంస్కృతి సంప్రదాయాలను పండుగల యొక్క గొప్పతనాలను వాటి విశిష్టతను తెలియజేయడమే లక్ష్యంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.

# దోమడుగులో బతకమ్మ ఘాట్ల పరిశీలన

- **దోమడుగు వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన**
- **మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్థానిక కౌన్సిలర్ల, అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బతుకమ్మ ఘాట్ నిర్మాణం, క్రీడా మైదానం ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, వార్డు కౌన్సిలర్లు అభి శెట్టి రాజశేఖర్, మద్ది సోనీ శేఖర్ రెడ్డి, నర్సంపల్లి రాజిరెడ్డి, బ్యాగరి వరలక్ష్మి కృష్ణ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బతుకమ్మ ఘాట్‌కు స్థల పరిశీలన**

గ్రామంలోని నల్లకుంట, రాజనాల చెరువులు కలుషితం కావడంతో రాబోయే బతుకమ్మ నిమజ్జన వేడుకలకు ప్రత్యామ్నాయంగా మైలకుంట చెరువును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో చెరువు వద్ద నూతనంగా నిర్మించనున్న బతుకమ్మ నిమజ్జన ఘాట్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.





# గునుక పువ్వుకు కరువు.. బతుకమ్మకు పూలే దిక్కు!

- పల్లె పొలాల్లో కనిపించని తంగేడు, గునుక
- పూల కోసం పట్టణాల వైపు పరుగులు
- వర్షాల ప్రభావంతో తగ్గిన పుష్పాల లభ్యత
- ఆందోళనలో మహిళలు



**గుమ్మడిదల, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు వేళైంది. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగలో ప్రకృతి ప్రసాదించిన పూలకే ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా పొలాల గట్ల వద్ద సహజసిద్ధంగా లభించే గునుక పువ్వులతో బతుకమ్మను పేర్చి గౌరమ్మగా భావించి పూజించడం తెలంగాణ ఆడపడుచుల సంప్రదాయం. అయితే ఈసారి బతుకమ్మ పండుగకు గునుక పువ్వుల కొరత మహిళలను ఆందోళనకు గురిచేస్తోంది. సాధారణంగా బతుకమ్మ పండుగ సమయానికి పంట పొలాలు, పొలాల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా కనిపించే గునుక పువ్వులు ఈసారి పెద్దగా కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురవడం వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావంతో గునుక పువ్వుల లభ్యత గణనీయంగా తగ్గినట్లు గ్రామీణ ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు.

**పొలాల వైపు వెళ్లినా పూలు కనిపించని పరిస్థితి**

గతంలో బతుకమ్మ పండుగకు కొన్ని రోజుల ముందుగానే మహిళలు, చిన్నారులు పొలాల బాట పట్టి గునుక, తంగేడు తదితర పూలను సేకరించేవారు. కుటుంబ సభ్యులంతా కలిసి పూలను ఏరుకుని ఇంటికి తీసుకొచ్చి బతుకమ్మను పేర్చడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈసారి ఎక్కడ పొలాల్లో చూసినా గునుక పువ్వులు పెద్దగా కనిపించకపోవడంతో పూల సేకరణ కష్టంగా మారింది. దీంతో బతుకమ్మను సంప్రదాయబద్ధంగా గౌరమ్మ రూపంలో పేర్చి పూజించాలంటే పూలే దిక్కవుతున్న పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో సహజంగా లభించే పూలు తగ్గిపోవడంతో మహిళలు ప్రస్తుతం పూల మార్కెట్లు, పట్టణ ప్రాంతాల్లో విక్రయించే పూలపై ఆధారపడాల్సి వస్తోంది.

**పూల ధరలపై ప్రభావం పడే అవకాశం**

గునుక, తంగేడు తదితర సంప్రదాయ బతుకమ్మ పూలకు డిమాండ్ పెరగడంతో మార్కెట్‌లో పూల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని మహిళలు పేర్కొంటున్నారు. గతంలో ఉచితంగా పొలాల వద్దే లభించే పూలను ఇప్పుడు డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రావడం పల్లె మహిళలకు ఇబ్బందిగా మారింది. ప్రకృతితో ముడిపడి ఉన్న బతుకమ్మ పండుగలో సహజసిద్ధమైన పూలకు ఉన్న ప్రాధాన్యత రోజురోజుకు తగ్గిపోతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. పూల కొరత ఉన్నప్పటికీ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బతుకమ్మను ఘనంగా నిర్వహించేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు.

# 60 లక్షలతో బాక్స్ క్రికెట్ మైదానం





- సీసీ రోడ్డు పనుల నిర్మాణం స్థల పరిశీలన
- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, అక్టోబర్ 9 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులోని యువతకు క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూ.60 లక్షల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న బాక్స్ క్రికెట్ మైదానంకు స్థలాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం వార్డులో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను తనిఖీ చేసి, పనుల నాణ్యతపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ దశరథ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, వార్డు కౌన్సిలర్లు అభి శెట్టి రాజశేఖర్, మద్ది సోనీ శేఖర్ రెడ్డి, నర్సంపల్లి రాజిరెడ్డి, బ్యాగరి వరలక్ష్మి కృష్ణ వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నగర అభివృద్ధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన**

దోమడుగు వార్డులో నగర అభివృద్ధి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**సీఎస్ఆర్ నిధులతో పాఠశాల అభివృద్ధి**

నూలాండ్ ల్యాబొరేటరీస్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దోమడుగు ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న
వివిధ మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.

# తూప్రాన్ గీతా జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**తూప్రాన్ అక్టోబర్ 09 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని నేషనల్ హైవే 44 పక్కనే ఉన్న గీతా జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగను కళాశాల విద్యార్థినులు మహిళా ఉపన్యాసకులు అత్యంత భక్తి శ్రద్ధలతో రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆటపాటలతో ఆడి పాడారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ ఆడబిడ్డల ఐక్యతకు ఆనందాలకు ప్రతీకగా తెలంగాణ సాంప్రదాయాలలో ఎంతో గొప్పగా చెప్పుకునే స్థాయిలో బతుకమ్మ పండుగ నిలిచిందని తొమ్మిది రోజులపాటు గౌరమ్మ బొడ్డెమ్మలతో మొదలై పూల బతుకమ్మ సద్దుల బతుకమ్మతో సాంప్రదాయ పట్టు వస్త్రాలతో కట్టుబొట్టుతో మహిళలు ఆటపాటలతో ఆనందంగా జరుపుకునే ఈ బతుకమ్మ పండుగ గొప్ప గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు భరత్, డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ రాజు, ఇంచార్జి ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంప్రదాయానికి పట్టం!

- సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినుల సందడి
- ఆటపాటలతో మార్మోగిన పాఠశాల ప్రాంగణాలు






**గుమ్మడిదల, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఉండటంతో ముందుగానే విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సంబరాలను నిర్వహించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలతో పాటు గుమ్మడిదల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో పాఠశాలలకు చేరుకుని రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. గునుగు, తంగేడు తదితర పూలతో బతుకమ్మలను వరుసలుగా అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు. చిన్నారుల కేరింతలు, పాటలు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. విద్యార్థులు ఒకరితో ఒకరు కలిసి బతుకమ్మలను తయారు చేయడం, సంప్రదాయ పాటలు పాడడం ద్వారా పండుగ విశిష్టతను చాటిచెప్పారు.

**భావితరాలకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేస్తూ**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడంలో పాఠశాలల్లో నిర్వహించే ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయి. ఆధునిక విద్యతో పాటు మన పూర్వీకుల నుంచి అందివచ్చిన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మను పేర్చే విధానం, పాటలు పాడుతూ ఆడే సంప్రదాయ పద్ధతులను నేర్చుకుంటూ తెలంగాణ సంస్కృతిపై ఆసక్తిని పెంపొందించుకున్నారు. పండుగ సెలవులకు ముందు నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు ఐకమత్యం, సాంస్కృతిక విలువల పట్ల అవగాహనను పెంచాయి. పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో పండుగ ఉత్సాహం వెల్లివిరిసింది.

# కాకతీయ టెక్నో హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు




**సిద్దిపేట అక్టోబర్ 09 (సిరి న్యూస్)**

స్థానిక సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారి విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయం నుంచే తంగేడు, చామంతి, గులాబీ, గునుగు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అనంతరం నృత్యాలు, కోలాటాలతో ఆడి పాడి సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట జిల్లా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహించాలని, చిన్ననాటి నుంచే విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించి వాటిని పరిరక్షించేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కోమటి చెరువు వద్దకు చేరుకుని బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను కోమటి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీపై తనిఖీలు

- నిబంధనల అమలుపై అధికారుల పరిశీలన..
- అగ్నిమాపక పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.
- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయమాలిని.



**మెదక్ అక్టోబర్ 09(సిరి న్యూస్)**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయమాలిని సూచించారు. శుక్రవారం మెదక్ డివిజన్ పరిధిలోని లైఫ్‌కేర్ నర్సింగ్ హోమ్, సూఫీ, రేన్‌బో ఆసుపత్రుల్లో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఫైర్ ఆడిట్, పరికరాల రెన్యూవల్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రేన్‌బో ఆసుపత్రిలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. అగ్నిమాపక పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, రోగులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సర్దన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్ల శారదను మర్యాదపూర్వకంగా కలిసిన గుండు సుధారాణి

**హనుమకొండ, అక్టోబర్ 9**



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద వరంగల్ పర్యటనకు వచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ గుండు సుధారాణి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నేరెళ్ల శారదకు గుండు సుధారాణి శాలువా కప్పి సత్కరించారు. ఇరువురూ ఆత్మీయంగా పలకరించుకుని పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నిర్వహిస్తున్న బాధ్యతల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించాల్సిన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

# చిట్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కొడంగల్ మండలం, అక్టోబర్,09**

స్థానిక మండల పరిధిలోని చిట్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయ ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను అత్యంత ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను కొలువుదీర్చి, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలు పాడుతూ, లయబద్ధంగా చప్పట్లు కొడుతూ ఉల్లాసంగా నృత్యాలు చేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బనలక్ష్మి మాట్లాడుతూ, ప్రకృతిని ఆరాధించే విశిష్ట పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ, మన ఆచారాలను భావితరాలకు అందించే లక్ష్యంతో పాఠశాలలో ఈ సంబరాలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనంతరం బతుకమ్మలను ఘనంగా నిమజ్జనం చేసి, విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయలు గోవర్ధన్ అబ్దుల్ హాక్ రాజు జ్యోతి అంగన్వాడి టీచర్ రుక్మిణి దేవి అనిత మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా లో ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, అక్టోబర్,09**

జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,శుక్రవారం పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు.ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు.ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ వెంకటాచారి,ఎన్నిక కల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, తహసిల్దార్ లక్ష్మీనారాయణ,సిబ్బంది ఉన్నారు.



# జడ్పీహెచ్ఎస్ పాంపాడ్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు




- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు**

**సంగారెడ్డి జిల్లా అక్టోబర్09 పాంపాడ్**

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాయికోడ్ మండలం పాంపాడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, సామాజిక సమైక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంలో ఇటువంటి పండుగల నిర్వహణ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి. నర్సింహులు ముఖ్యంగా పాల్గొన్నారు. జడ్పీహెచ్ఎస్ పాంపాడ్ ప్రధానోపాధ్యాయురాలు ఐ. సంగీత, జడ్పీహెచ్ఎస్ రాయికోడ్ ప్రధానోపాధ్యాయుడు కె. నాగేశ్, జడ్పీహెచ్ఎస్ హస్నాబాద్ ప్రధానోపాధ్యాయుడు జె. శాంతం, ఎంపీపీఎస్ రాయికోడ్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాస్ పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు అలాగే కోఆర్డినేటర్ అనిల్ కుమార్, సీఆర్‌పీలు దత్తు, రాజు, ఉపాధ్యాయులు అరుణ, సుభాషిణి, ప్రసన్నలత, రాములు, మాచేందర్, ఆస్పియా, ఎంపీపీఎస్ పాంపాడ్ ప్రధానోపాధ్యాయురాలు టి. సౌజన్య, రాజమల్లేశం తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ వంటి పండుగలు దోహదపడతాయని, పాఠశాలల్లో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి పట్ల గౌరవం, ఐక్యతా భావం పెంపొందుతాయని తెలిపారు.

# మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి

- **కొడంగల్ లో ఘన నివాళి**

**కొడంగల్ మున్సిపల్, అక్టోబర్,09**

బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న రాజ్యాన్ని సాకారం చేయడానికి బహుజన్ సమాజ్ పార్టీ (BSP) ని స్థాపించి, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారపు రుచి చూపిన మహనీయుడు,బాబాసాహెబ్ వారసుడు, బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపిన మహనీయుడు మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా కొడంగల్ లోని డా. అంబేద్కర్ విగ్రహం ముందు ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం హైదరాబాద్ బడంగ్‌పేట్ లో జరగబోయే "బహుజన రాజ్యాధికార సమరభేరి" సభకు కొడంగల్ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు..



# వైభవంగా కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- **ఈనెల 11 నుంచి 16 వరకు ఆధ్యాత్మిక వేడుకలు**
- **ఆరు రోజుల పాటు వివిధ వాహన సేవలు**
- **14న కల్యాణోత్సవం**

**గుమ్మడిదల, (సిరి న్యూస్):**

పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దసరా పండుగకు ముందు ప్రతి ఏటా నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈ ఏడాది కూడా స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సిద్ధమైంది. ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు, వాహన సేవలు, కల్యాణోత్సవం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్‌రెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త నరసింహాచార్యులు తెలిపారు. ఆలయ నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వారు పేర్కొన్నారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా గుమ్మడిదలతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొంటారు. భక్తి శ్రద్ధలతో జరిగే ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతాయని తెలిపారు.

**ప్రత్యేకతను సంతరించుకున్న ఆలయం**

గుమ్మడిదలలోని ఈ ఆలయాన్ని సాధారణంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంగా కాకుండా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంగా పిలుస్తారు. స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువై ఉండటంతో ఈ ఆలయానికి కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంగా ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. ఆలయంలోని గర్భగుడిని పరిశీలిస్తే స్వామి వారితో పాటు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు కొలువై ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆలయంలో స్వామివారిని దర్శించుకునే భక్తులకు శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనం కలగడం విశేషమని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారి దివ్య దర్శనం, ఆలయంలో కొనసాగుతున్న సంప్రదాయ పూజా విధానాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

**ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11వ తేదీన ఉత్సవాలు ప్రారంభమై 16వ తేదీన ముగియనున్నాయి. ఆరు రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 11న బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 12న ధ్వజారోహణ, సాయంత్రం శేషవాహన సేవ, 13న స్వామివారికి అభిషేకం అనంతరం గజవాహన సేవ, 14న మధ్యాహ్నం స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం హనుమంత వాహన సేవ, 15న సదస్యము కార్యక్రమంతో పాటు స్వామివారి గరుడ వాహన సేవ, 16న మహా పూర్ణాహుతి కార్యక్రమంతో పాటు అశ్వవాహన సేవ నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు.

**భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. స్వామివారి వాహన సేవలు, కల్యాణోత్సవం తదితర కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. గుమ్మడిదల ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు కూడా ఈ ఆరు రోజుల బ్రహ్మోత్సవాల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్‌రెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త నరసింహాచార్యులు కోరారు . భక్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# సీబీఎస్ షాపింగ్ మాల్ లో తలుక్కుమన్న తార

- **స్పెషల్ అట్రాక్షన్ గా హీరోయిన్ పాయల్ రాజ్ పుత్.**
- **సీబీఎస్ దసరా డబుల్ ధమాకా సేల్ ప్రారంభం.**
- **పండుగ ఆఫర్లతో వినియోగదారులకు ఊరట.**

**మెదక్ అక్టోబర్,09 (సిరి న్యూస్)**

మెదక్ సిబిఎస్ లో ప్రముఖ సినినటి హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ శుక్రవారం సందడి చేశారు.దసరా పండుగ వేళ వస్త్రప్రియులకు ప్రత్యేక ఆఫర్లు,ఆకర్షణీయమైన బహుమతులతో చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ (సీబీఎస్) డబుల్ ధమాకా సెల్ ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరై మెరుపులు పోయించారు.మెదక్ పట్టణంలోని చర్చి సమీపంలో ఉన్న సీబీఎస్ షోరూం పాయల్ రాకతో సందడి నెలకొనగా, ప్రత్యేక ఆఫర్లతో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సినీనటి పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ.. మెదక్‌కు రావడం, సీబీఎస్ దసరా డబుల్ ధమాకా సేల్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో వస్త్రాలు లభించడం విశేషమన్నారు. రూ.49 నుంచే వస్త్రాల ధరలు ప్రారంభమవుతున్నాయని, రూ.1,999 నుంచి వినియోగదారులకు ప్రత్యేక బహుమతులు అందించే సంప్రదాయాన్ని సంస్థ కొనసాగిస్తోందని తెలిపారు. కుటుంబ వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలు, షూటింగ్ కాస్ట్యూమ్స్ కోసం సీబీఎస్‌లోనే షాపింగ్ చేస్తానని, ఇక్కడ లభించే విభిన్న డిజైన్లు, వస్త్రాల వెరైటీ తనను ఆకట్టుకుంటాయని అన్నారు. సీబీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జానా సురేష్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా వస్త్ర వ్యాపార రంగంలో కొనసాగుతున్న తమ సంస్థ వినియోగదారుల ఆదరణతో తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తోందన్నారు. ప్రతి షోరూంలోనూ స్థానిక ప్రజల అభిరుచులకు అనుగుణంగా సంప్రదాయ, ఆధునిక వస్త్రాలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అన్ని ఆదాయ వర్గాల ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జబర్దస్త్,బుల్లితెర నటులు సుడిగాలి సుధాకర్ బృందం పాల్గొని మెదక్ ప్రజలను ఉర్రుతలూగించారు.






# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండగ

**రాయికోడ్, అక్టోబర్ 09(సిరిన్యూస్):**

తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాయికోడ్ మండలం పాంపాడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, సామాజిక సమైక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంలో ఇటువంటి పండుగల నిర్వహణ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి. నర్సింహులు, జడ్పీహెచ్ఎస్ పాంపాడ్ ప్రధానోపాధ్యాయురాలు ఐ. సంగీత, జడ్పీహెచ్ఎస్ రాయికోడ్ ప్రధానోపాధ్యాయుడు కె. నాగేశ్, జడ్పీహెచ్ఎస్ హస్నాబాద్ ప్రధానోపాధ్యాయుడు జె. శాంతం, ఎంపీపీఎస్ రాయికోడ్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాస్ పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఎం ఆర్ సి సిబ్బంది అనిల్ కుమార్, సీఆర్‌పీలు దత్తు, రాజు, ఉపాధ్యాయులు అరుణ, సుభాషిణి, ప్రసన్నలత, రాములు, మాచేందర్, ఆస్పియా, ఎంపీపీఎస్ పాంపాడ్ ప్రధానోపాధ్యాయురాలు టి. సౌజన్య, రాజమల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# టీబీ ముక్త్ గ్రామ పంచాయతీగా సైదాపూర్ ఎంపిక..

- **సర్పంచ్ ను అభినందించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**
- **ప్రశంసా పత్రాన్ని అందుకున్న సర్పంచ్ రాధిక రామగౌడ్**

**సంగారెడ్డి, అక్టోబర్ 9 (సిరి న్యూస్):**

సంగారెడ్డి నియోజకవర్గంలోని సైదాపూర్ గ్రామ పంచాయతీ టీబీ ముక్త్ గ్రామంగా ఎంపిక కావడం పట్ల సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రక్షణలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన సైదాపూర్ గ్రామం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా సైదాపూర్ గ్రామ సర్పంచ్ రాధిక రామగౌడ్ సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆమె ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ విజయం గురించిన వివరాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక రామగౌడ్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శాలువా కప్పి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాన్ని పూర్తిగా టీబీ రహిత గ్రామంగా మార్చేందుకు నిరంతరం శ్రమించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం, అంకితభావంతో పనిచేసిన వైద్య ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారుల సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రజారోగ్య పరిరక్షణలో గ్రామీణ స్థాయి యంత్రాంగం పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థులకు ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం, టీబీ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించడం, బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూసేందుకు చేపట్టిన కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగించాలని సూచించారు. సైదాపూర్ గ్రామం సాధించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు సంగారెడ్డి నియోజకవర్గంలోని మిగతా అన్ని గ్రామ పంచాయతీలకు కూడా చక్కటి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అభిప్రాయపడ్డారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.